మే 2026

రు. 20/-

# చైతన్యం

సంకల్ప బలం




## మాతృ దినోత్సవ శుభాకాంక్షలు


ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మించిన
చీనాబ్ వంతెన


సూర్య బింబాన్ని కప్పేసిన చందమామ
ఆర్టెమిస్ వ్యోమగాములు తీసిన ఫోటో




చైతన్యం సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

మే 2026

సంపుటి -15 సంచిక - 8



వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి


## ఈ సంచికలో....


సంపాదకీయం 4

వార్తా విశేషాలు 7

కాశి మజిలీ కథలు 37

ప్రభాస తీర్థం 40

తూర్పు గోదావరి జిల్లా 42

కలియుగ ప్రత్యక్ష దైవం 44

శ్రీ ఆంజనేయం 45

జనలిస్తుల ఫోరం 48

నా తెలంగాణా తల్లి 49

అమ్మ 50



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## చైతన్యం సంకల్పబలం పాఠక దేవుళ్ళకు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

### కార్మికులకు 'మేడే ' శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మేడే సందర్భంగా కార్మిక వర్గానికి సీఎం గురువారం ఒక ప్రకటనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శ్రామికులే మా ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వాములు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుంది. అలాగే గల్ఫ్ దేశాల్లో పనిచేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం అని సీఎం పేర్కొన్నారు.

### పాఠక దేవుళ్ళకు మాతృదినోత్సవ శుభాకాంక్షలు

అమ్మ అనే పదం అమృతం. ఆ పిలుపులోనే ఒక మాధుర్యం ఉంటుంది. సృష్టిలో ప్రతి ప్రాణికి మూల కారణం అమ్మ. కన్నతల్లి, బిడ్డను తొమ్మిది నెలలు గర్భాశయంలో పెంచి తర్వాత జన్మనిచ్చిన ప్రేమ మూర్తి జన్మనిచ్చిన క్షణం నుంచి తన ఊపిరి ఉన్నంత వరకు ప్రాణానికి ప్రాణంగా చూసుకునేది తల్లి మాత్రమే. అలాంటి తల్లిని ఏ విధంగా పిల్లలు చూసుకోవాలి? ఆ చూసుకోవడం అంటే, తల్లి కని పెంచి, పెద్ద చేసి  చూసుకుంది కాబట్టి అనే పదం కాదు అక్కడ. అలాగే ఏ తల్లి తన పిల్లలు తనకు తిరిగి చేయాలి అని ఆశించదు. కానీ..ఈ రోజుల్లో తల్లి కూడా ఉద్యోగం చేయనిదే చాలామందికి గడవదు. మరికొందరైతే చేసే తెలివితేటలు, చెయ్యాలనే కోరిక ఉండడంతో కూడా చెయ్యడం జరుగుతుంది. అలాంటి తల్లికి పిల్లలు పనిలో, సహాయసహకారాలు అందివ్వాలి. ఇంటి పని అంటే అమ్మ ఒక్కత్తి పని మాత్రమే కాదు, అందరం ఇంట్లో ఉంటాం, ఇంట్లో అన్నీ అనుభవిస్తాం, అలాగే అన్నీ తింటాం. అలాగే పని కూడా అందరిదీ అనే భావన కుటుంబంలో ప్రతి ఒక్కరికి ఉండాలి. పిల్లలు తమ చదువులో తల్లిని ఇబ్బంది పెట్టకుండా చదువులో ముందుండి ఆమెను సంతోషపెడుతూ ఉండాలి. అమ్మకి నచ్చని పని, వద్దన్నపనీ చేయకూడదు.

### తల్లికి ఇచ్చే పెద్ద బహుమతి -- తల్లి మనసు బాధపడకుండా చూసుకోవడమే

పిల్లలు వారి జీవితంలో చేయవలసిందల్లా ఒక్కటే ... తల్లి మనసు బాధ పడకుండా చూసుకోవాలి. తల్లి కి శారీరకంగా శక్తి తగ్గినప్పుడు, అండగా నిలబడి, అమ్మా! నీకు మేమున్నాం అని తల్లిని సంతోష పెట్టండి. ముఖ్యంగా మాటలతో. అవసరమైన చోట, అలాగే శారీరకంగా, ఆర్థికంగా అండగా నిలబడాలి. తల్లి బ్రతికి ఉన్నంత సేపు పిల్లలు మేమున్నాం అనే ధైర్యాన్ని ఇవ్వాలి. ఎంత దూరంలో పిల్లలు ఉన్నా, అండగా నిలబడడానికి ఎటువంటి ఇబ్బంది లేదు. ఈ రోజుల్లో అది ఎంత మాత్రం కష్టమైనది కాదు.

ఇంకా కొందరైతే నీకు అన్నయ్య అంటే ఇష్టం అని, చెల్లెలు అంటే ఇష్టమని అంటూ ఉంటారు. అలాగే వాళ్ళకే ఎక్కువ ఆస్తులు, వస్తువులు ఇచ్చావు, నేనంటే నీకు ఇష్టం లేదు అంటూ ఉంటారు. అది చాలా తప్పు. అంతే కాదు పాపం కూడా. ఏ పిల్లలు ఎందులో వీక్ గా ఉన్నారో తెలుసుకుని, ఎవరికి ఏది అవసరమో అది ఇవ్వాలన్నదే ఆ తల్లి తాపత్రయం అన్నది ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలి. అంతే  కాదు, తనకి ఎవరు అండగా నిలబడతారో, వాళ్ళకి  ఇవ్వాలని చూడడం కూడా తప్పు కాదు. కానీ నిజాయితీగా ప్రేమగా చూసే పిల్లలకు తల్లి, ఏమిచ్చిందా? అనే వాటి మీద ఉండదు. తల్లికి ఎంత చేస్తే అంత ఆనందపడుతూ ఉంటారు. అంత అదృష్టంగా భావిస్తారు. కానీ కొందరు స్వార్థ పరులు ఆ తల్లికే పుట్టినా, స్వార్థపూరిత ఆలోచనలలో ఉంటారు. ఇటువంటి ఆలోచనలు మన లోంచి పోవాలి. తల్లిని ఆనందంగా ఉంచుదాం .అదే అందరికీ శ్రీరామ రక్ష.  అదే నిజమైన మాతృ దినోత్సవం.

### పాఠకదేవుళ్ళకు హనుమజ్జయంతి శుభాకాంక్షలు

హనుమంతుని జన్మోత్సవం వైశాఖ శుద్ధ దశమి నాడు జరుపుకుంటారు. హనుమంతుని జన్మ వృత్తాంతం శివ పురాణం, రామాయణం మొదలైన గ్రంథాలలో అనేకానేక గాథలతో వివరించబడి ఉంది. హిందూ పురాణాల కథల ప్రకారం పుంజిక స్థల అనే అప్సరస అంజనా అనే వానర కాంతగా జన్మించింది. కేసరి అనే వానర వీరుడు ఆమెను పెళ్ళాడెను. వారు సంతానం కొరకు భక్తితో శివుని ఆరాధించిరి. అప్పుడు వాయుదేవుడు శివుని తేజమును పండు రూపంలో అంజన కొసగెను. అంజనకు జన్మించిన సుతుడే ఆంజనేయుడు, కేసరి నందనుడు, వాయుదేవుని అనుగ్రహముతో జన్మించినందున వాయుసుతుడనీ అంటారు.  సాంప్రదాయాన్ని అనుసరించి హనుమంతుని ఉపాసకులు కూడా ఈ పండుగ జరుపుకుంటారు.

హనుమజయంతి  ఏడాదికి రెండు సార్లు జరుపుకుంటారు.  చైత్ర పౌర్ణమి నాడు హనుమంతుడు జన్మించా-

డని ఉత్తర భారతదేశంలో నమ్ముతారు. అలాగే సీతమ్మను కనుగొని రావణుడిపై విజయం సాధించిన రోజు కావడంతో దీనిని విజయోత్సవంగా కూడా భావిస్తారు.

## తెలంగాణ వార్తలు

### ప్రభుత్వానికి కళ్ళు, చెవులు విప్ లే -- సీఎం రేవంత్ రెడ్డి

ప్రభుత్వానికి కళ్ళు చెవులు విప్ లేనని, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చే బాధ్యత వారిదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఎంపీ నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పాట్నా మహేందర్ రెడ్డి, విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్యా, యెన్నం శ్రీనివాసరెడ్డి మొదలైన వారితో సీఎం సమావేశమై చర్చించారు. వేసవి నేపథ్యంలో నియోజకవర్గాల్లో తాగు, సాగు నీటి అవసరాలకు తీసుకోవలసిన చర్యలు, ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

### పీఆర్సీపై తక్షణమే నివేదిక --- రేవంత్ రెడ్డి ఆదేశం జూన్ 1వ తేదీ లోగా ఉద్యోగులందరికీ ఆరోగ్య కార్డులు ఇస్తాం

ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పీఆర్సీ ఐ తక్షణమే నివేదిక అందినచాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు వెల్లడించారు. రానున్న 100 రోజుల్లో విశ్రాంత ఉద్యోగులకు రూ 6 వేల కోట్ల బకాయిలు చెల్లిస్తామని పునరుద్ఘాటించారు. తమది స్నేహ పూర్వక ప్రభుత్వమని.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు.

## ఆంధ్ర వార్తలు :

### ఏప్రిల్ 18 నుంచి 26 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలు

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం తన 100 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 2026 లో అత్యంత ఘనంగా శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంది. ఏప్రిల్ 18 నుంచి 26 వరకు వారం రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో విద్య, పరిశోధన మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఉప రాష్ట్రపతి, గవర్నర్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు, మరియు అనేక మంది ప్రముఖులు ఈ చారిత్రాత్మక ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు.

### బహు సంతాన ప్రాప్తి రస్తు --- పిల్లలే సంపద గ్రామ సభలు ... అమరావతి

ఇన్నాళ్లూ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను ప్రోత్సహించిన ప్రభుత్వం, రాష్ట్రంలో జనాభా పరంగా గతి తప్పు తున్న పరిస్థితి ఏర్పడేసరికి, ప్రభుత్వం అప్రమత్తమవడం మొదలైంది. నానాటికీ యువత సంఖ్యా తగ్గి, వృద్ధుల జనాభా పెరుగుతుండడంతో క్షేత్ర స్థాయి పరిస్థితులను చక్కదిద్దేందుకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా ప్రతి నెలా నాలుగో శనివారం 'పిల్లలే సంపద' గ్రామ సభలు నిర్వహించడం, ఏటా 50 వేల జంటలకు ఉచితంగా ఐవీఎఫ్ సౌకర్యం జనాభా మెరుగుపై దృష్టి పెడితే...ఆరోగ్యాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ అమలుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం రూ 782. 25 కోట్ల నిధులతో ప్రణాళికను పట్టాలెక్కించనుంది.

## జాతీయ వార్తలు :

### యావద్భారత దేశంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీ ఫలితాల్లో భాజపా ప్రభంజనం - దళపతి సంచలనం కేరళలో యూడీఎఫ్ -- అస్సాంలో తిరుగులేని కమలం -- పుదుచ్చేరిలో సామాన్యుడే రారాజు

మమత కోటను బద్దలు కొట్టిన మోదీ అయినా, కేరళలో అయినా, తమిళ్ నాడు లో విజయాన్ని పొందిన విజయ్ అయినా ప్రజలు కోరుకునేది ఒక్కటే. మన చుట్టూ ఉన్న దేశాల నుంచి దేశ భద్రత, సామాన్యుడు హాయిగా బ్రతగ్గలగడం, అంటే తిండికి, గుడ్డకి విద్యకి లోటు లేకుండా ఉండడం చాలా అవసరం.స్త్రీలకు అన్ని చోట్ల ... ముఖ్యంగా అన్ని పదవులలో ప్రాధాన్యత ఉండాలి. రాజకీయాలలో స్త్రీలు 50% ఉండాలి.ప్రాధాన్యత అంటే మీటింగ్ లలో ఊదరగొట్టడం కాదు, చేతల్లో చూపించాలి. స్త్రీ తెలివితేటలు సమాజానికి పూర్తిగా ఉపయోగపడడం లేదు. ఒక పరిధితో మన సమాజం ఆపేస్తోంది స్త్రీ తెలివితేటల్ని ఉపయోగాపదనివ్వకుండా అడ్డుకుంటున్నది ఎక్కువగా పురుషులయితే , కొందరు కుటుంబంలోని స్త్రీలు కుడా ఆటంకం కలిగిస్తున్నారు . ఇవన్నీ కూడామన దేశ అభివృద్ధికి ఒక ఆటంకంగా చెప్పవచ్చు. పెన్షన్ రాని వారివి , మధ్య తరగతి బ్రతుకులు బ్రతికే వాళ్ల పన్నులు తీసుకెళ్ళి, అన్నీ ఉన్నవాళ్లకే ఇచ్చుకుంటూ పోయే ప్రభుత్వం, తమ పదవులు కాపాడుకునే వారి కోసం సొమ్మంతా పంచుకుంటూ పొతే, సామాన్య ప్రజల గురించి ఎప్పుడు ఆలోచిస్తుంది?ఈ ప్రభుత్వం

అని విశ్లేషకులు అంటున్నారు. 40 సంవత్సరాలు పని చేసి తినడానికి కూడా లేక ఎంతో మంది కష్టపడుతున్నారు. ఈ పరిపాలనను ఏమనాలి? అని చైతన్యం సంకల్పబలం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. పేద ప్రజల కోసం పంచుతున్నాం అనే ప్రభుత్వాలు, నిజంగా పేదవారికే అందుతున్నాయా? అని ఎప్పటికప్పుడు చెక్ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సంద్రంలో ... మన జెండా

సముద్రగర్భంలో భారీ జాతీయ జెండాను ఆవిష్కరించి అండమాన్ నికోబార్ యంత్రాంగం గిన్నిస్ రికార్డు సాధించింది. 6040 మీటర్ల త్రివర్ణ పతాకాన్ని నౌకాదళం, తీర రక్షక దళ, అటవీ, పోలీసు సిబ్బంది కలిసి విజయవంతంగా సముద్ర నీటి అడుగున ఆవిష్కరించాయి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు దీన్ని నమోదు చేసి, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ డి.కె. జోషికి ధ్రువపత్రం అందజేశారు. ఈ ఘనత ఇక్కడ అభివృద్ధి చెందుతున్న సాహస పర్యాటకానికి దోహదపడుతుందని జోషి పేర్కొన్నారు.

అంతర్జాతీయ వార్తలు :

ఇద్దరు భారతీయ జర్నలిస్టులకు పులిట్జర్

పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే పులిట్జర్ పురస్కారం ఇద్దరు భారతీయ జర్నలిస్టులను వరించింది. డిజిటల్ నిఘా, సైబర్ మోసాలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చినందుకు ఆనంద్ ఆర్క్, సుపర్ణా శర్మ ఈ అవార్డును దక్కించుకున్నారు. ఇలాస్ట్రేడ్ రిపోర్టింగ్, కామెంటరీ విభాగం కింద దీనిని ప్రకటించారు. ప్రముఖ మీడియా సంస్థ బ్లూమ్ బెర్గ్ కు చెందిన నటాలీ ఒబికో పియర్సన్ తో కలిసి ఆనంద్ , సుపర్ణ ఆ అవార్డును షేర్ చేసుకున్నారు.

ఇరాన్ దాడుల్లో భారతీయాలకు గాయాలు -- స్పందించిన కేంద్రం

యూఏఈలోని ఫూజైరా ఆయిల్ ఇండస్ట్రీ జోన్ లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపై ఇరాన్ చేసిన డ్రోన్ దాడి లో ముగ్గురు భారతీయులకు గాయాలవగా, ఈ ఘటనపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందించింది, మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. పశ్చిమాసియా అంతటా శాంతి స్థిరత్వం పునరుద్ధరించేలా పరిస్థితులు చక్కదిద్దడానికి చర్చలు, దౌత్యం కోసం భారత్ తన మద్దత్తును కొనసాగిస్తుందని తెలిపింది.

ప్రమాదంలో వెయ్యి కోట్ల భోజనాలు -- ఆహారం పైనా యుద్ధం

హార్మోజ్ జలసంధి మూత పడటంతో చమురే కాక ఎరువుల సరఫరా పైనా పెను ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎరువుల వ్యాపారంలో (యూరియా, పొటాష్ , అమ్మోనియా, ఫాస్ఫేట్)మూడింట ఒక వంతు ఈ మార్గం నుంచే జరుగుతోంది. ఈ మార్గం మూసుకుపోవడంతో రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తి గణనీయంగా పడిపోనున్నదని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎరువుల ధరలు 80 శాతం పెరగడంతో వారానికి దాదాపు 1000 కోట్ల భోజనాలకు ముప్పు తప్పదని నిరుపేద దేశాలకు ఇది శరాఘాతమే నని, ప్రపంచ ప్రఖ్యాత ఎరువుల కంపెనీల అధిపతులలో ఒకరైన స్వీన్ టోర్ హల్ సెదర్ హెచ్చరిస్తున్నారు.

యుద్ధాలు, పట్టుదలలు అమెరికా, ఇరాన్ నాయకత్వం లో ఉంటే, ముఖ్యంగా మధ్యలో మిగిలిన దేశాల ప్రజలు, అమెరికా , ఇరాన్ లోని పేద ప్రజలు కూడా నలిగిపోతున్నారు. డబ్బు ఉన్నవారికి ఇబ్బంది లేదు. కానీ నిరుపేద దేశాలలోని నిరు పేదవారు ఆహారానికి, బయటకి కదలాలంటే ఆయిల్ కొరకు ఇలా అనేక ఇబ్బందులకు లోనవుతున్నారు. ఆయిల్ రేట్లు పెరగడంతో, సామాన్యులు ఇటు ఆటోల దగ్గర నుంచి విమానాల వరకు విపరీతంగా రేట్లు పెరిగి, భరించలేని స్థితిలో ఉన్నారనడంలో సందేహం లేదు.ఇప్పటికే మన దేశంలో ఆటోలు నడిపే వారు , టాక్సీలు నడిపేవారు సగంసగం ఆహారం తినడం లోకి వచ్చారు. పెరిగిన ఆటోల చార్జీలు చూసి, ఆటోలో ప్రయాణం చేయలేని పరిస్థితి మధ్య తరగతి వారిది.

త్వరలో అన్నీ సద్దుమణిగి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని కోరుకుంటోంది మీ చైతన్యం సంకల్పబలం.

సర్వేజనా సుఖినోభవంతు



తీగవరపు శాంతి

# వార్తా విశేషాలు

## డ్రగ్స్ నియంత్రణ –సీఎస్ -సాయి ప్రసాద్

రాష్ట్రంలో గంజాయి,డ్రగ్స్ వాడకాన్ని ఉక్కు పాదంతో అణచి వేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. ఇదొక సామాజిక సమస్య అని, వీటి నియంత్రణ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించ గలిగితేనే పూర్తి స్థాయిలో నివారించ గలుగుతామని గుంటూరు జిల్లా అమరావతి సచివాలయంలో బుధవారం జరిగిన నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన అన్నారు. యువత,విద్యార్థుల్లో గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల ను సేవిస్తే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నకార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని ఈగల్ చీఫ్ రవికృష్ణను సిసాయి ప్రసాద్ ఆదేశించారు. గంజాయి,డ్రగ్స్ ఒకటో , రెండు శాఖలకో సంబంధించిన సమస్య కాదని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయన అన్నారు. గంజాయి సాగు,రవాణా నియంత్రణపై సమన్వయం చేసుకునేందుకు వీలుగా ఒడిస్సా ప్రభుత్వానికి లేఖ వ్రాయనున్నట్టు సిఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

## దావోస్ ఒప్పందాలు- రేవంత్ రెడ్డి

దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సులతో పాటు ఇతర వేదికల్లో ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలు, సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్లో ఉన్న భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, కంపెనీలకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందాలు ఏ స్థితిలో ఉన్నాయి, అమలుకు ఉన్న ఆటంకాలు, వాటి పెట్టుబడులు, ఆ సంస్థలు కల్పించే ఉద్యోగాల వంటి అన్ని వివరాలు సీఎంఓ, ఆయా శాఖల మంత్రులు తెలుసుకునేలా రియల్ టైమ్ అప్డేట్స్ డ్యాష్బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

## ఆంధ్రాయూనివర్సిటీ శతాబ్ది ఉత్సవం-వెండి నాణెం

విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని 100 రూపాయల వెండి నాణెం విడుదల చేయనున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ కేంద్రం బుధవారం విడుదల చేసింది. 35 గ్రాముల బరువు, 44 మిల్లీమీటర్ల వ్యాసార్థం ఉండే ఈ నాణేన్ని 50% వెండి, 40% రాగి, 5% నికెల్, 5% జింక్తో రూపొందిస్తున్నారు. నాణేనికి ఒకవైపు సత్యమేవ జయతే అన్న సూక్తితో కూడిన నాలుగు సింహాల అశోక స్తూపం, 100 రూపాయలను, హిందీ, ఇంగ్లిష్లో భారత్, ఇండియా అన్న అక్షరాలు ఉంటాయి. మరోవైపు ఆంధ్రా యూనివర్సిటీ అధికారిక లోగో, దానికి కుడి ఎడమల్లో 1926, 2026 సంవత్సరాలు, ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు అని హిందీ, ఇంగ్లిష్లో ఉంటాయని కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

## ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం జిల్లాలో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. వర్షాకాలం రాకముందే పెండింగ్లో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్లను కూడా వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఆలస్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. సమస్యలు ఉంటే వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. టన్నెల్ పనులు దాదాపు పూర్తయ్యాయని, కేవలం 30 మీటర్లు మాత్రమే మిగిలి ఉన్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా లక్షా ముప్పై వేల ఎకరాలకు నీరందించనున్నట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ కాల్వల నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు.

## వనపర్తి జిల్లాలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం వెల్టూరు, పెద్దమందడి మండల కేంద్రం, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి చిట్యాల లోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ రెసిడెన్షియల్ స్కూల్లో 13.50 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన పి ఎం శ్రీ సైన్స్ ల్యాబ్ ను ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మెగా రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. వనపర్తి జిల్లాలోని పలు మండలాలలో నేడు ఎంపీ, ఎమ్మెల్యే సుడిగాలి పర్యటనలతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ను ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి ప్రారంభించిన సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి దూరదర్శన్ తో మాట్లాడుతూ వరి ధాన్యం అమ్మడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. మొత్తం 165 కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. నేటికీ 16 కేంద్రాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. తేమశాతం సరిగా ఉండేలా రైతులు చూసుకోవాలని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈసారి సరికొత్త యాప్ ను కూడా రూపొందించారని ఆ యాప్లో సరైన వివరాలు నమోదు చేస్తే వీలైనంత త్వరగా రైతుల ఖాతాలకు డబ్బులు జమవుతాయన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పుపై న్యాయస్థానం తీర్పుపై ములుగు జిల్లా బీఆర్ఎస్ నేతల సంబరాలు

జస్టిస్ గోస్ కమిషన్ నిలిపివేత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై నిందలు వేస్తే ఊరుకోం - బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణరావు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మకమైన కాలేశ్వరం ప్రాజెక్టు పై వేసిన గోష్ కమిటీ నివేదిక పై నేడు హైకోర్టు సంచల్గా తీర్పును ఇస్తూ ఇట్టి కమిషన్ ను కొట్టి వేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ములుగు జిల్లా కేంద్రంలోని టిఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణరావు మాట్లాడుతూ.... ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి తెలంగాణకు ఆయువు పట్టుగా ఉన్న కాలేశ్వరం ప్రాజెక్టు నీటి కష్టాలను తీర్చి, గత ఎన్నికల ముందు చిన్న తప్పిదంతో రెండు పిల్లర్స్ కుంగడం వల్ల ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ చేసిన మంచి పనులను బదనం చేయాలని, అప్రతిష్టపాలు చేయాలని, వారు సాధించిన బ్రహ్మాండమైన విజయాలను తక్కువ చేసి చూపించాలని, అని కుట్రపూరితంగా వచ్చిన తీర్పు వాస్తవాలను బయటపెడుతుందని, జస్టిస్ గోష్ కమిషన్ ఏదైతే రేవంత్ రెడ్డి గారు కాలేశ్వరం ప్రాజెక్టు పైన జరిగిన ఆ యొక్క ఇన్సిడెంట్ ని, మొత్తం ఎంక్వయిరీ చేసి, కెసిఆర్, హరీష్ రావు గారి వాదన వినకుండా ఏదైతే చేశారో ఈరోజు న్యాయస్థానం ఆ రిపోర్టును నిలిపివేసిందని కెసిఆర్ గారు ప్రజలకు చేసిన మంచి ఈరోజు మరోసారి నిరూపించబడిందని, కెసిఆర్ గారు ఆనాడు ప్రవేశపెట్టిన అనేక పథకాలు ప్రజల్లో చెరిగిపోని మృద్ర వేసుకున్నాయని లక్ష్మణరావు అన్నారు.

## విధి నిర్వహణలో మృతి చెందిన గిగ్ వర్కర్ల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా చెక్కులను అందజేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గిగ్ వర్కర్ల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి సెక్రటేరియట్లోని తన ఛాంబర్లో బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎక్స్గ్రేషియా చెక్కులను అందజేశారు. మృతి చెందిన గిగ్ వర్కర్లు లోకుర్తి నరేష్, జీ.శ్యామ్ సుందర్, అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా 'గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ చట్టాన్ని' అసెంబ్లీలో ఆమోదించిందని గుర్తు చేశారు. గిగ్ వర్కర్లకు, హమాలీలకు భద్రతా వలయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఏ కార్మికుడికి ఇబ్బంది కలిగినా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రక్రియలో గిగ్ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయడాన్ని మంత్రి అభినందించారు. ఆపద కాలంలో తమను ఆదుకున్నందుకు బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

## అటల్ పెన్షన్ యోజనలో 9 కోట్లు దాటిన మొత్తం నమోదుల సంఖ్య

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అటల్ పెన్షన్ యోజన' మరో కీలకమైలురాయిని అధిగమించింది. ఈ పథకంలో మొత్తం నమోదుల సంఖ్య ఈనెల 21 నాటికి 9 కోట్ల మార్కును దాటినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరంలోనే రికార్డు స్థాయిలో కోటి 35 లక్షల మంది కొత్తగా ఈ పథకంలో చేరారు. పథకం ప్రారంభమైనప్పటి నుండి ఒకే ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో నమోదులు జరగడం ఇదే తొలిసారి. భారతీయులందరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో 2015లో అటల్ పెన్షన్ యోజన ప్రారంభమైంది. ప్రధానంగా అసంఘటిత రంగ కార్మికులు, పేదలు, వెనుకబడిన వర్గాల వారికి వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ స్వచ్ఛంద పెన్షన్ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. తక్కువ ప్రీమియంతో పెన్షన్ పొందే అవకాశం ఉండటంతో సామాన్యుల నుండి ఈ పథకానికి విశేష స్పందన లభిస్తోంది. పెరుగుతున్న సబ్స్క్రైబర్ల సంఖ్య దేశంలో పెరుగుతున్న పొదుపు అలవాటుకు, సామాజిక భద్రతపై అవగాహనకు నిదర్శనమని ఆర్థిక శాఖ పేర్కొంది.

## ఎన్నికల వేళ తమిళనాడు, పశ్చిమ బెంగాల్లలో రూ.1,072 కోట్లు స్వాధీనం




అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం తనిఖీలను ముమ్మరం చేసింది. మార్చి 15న ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుండి ఇప్పటివరకు తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ.1,072.13 కోట్లకు చేరింది. ఇందులో తమిళనాడులో అత్యధికంగా రూ.599.24 కోట్ల విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకోగా, పశ్చిమ బెంగాల్లో రూ.472.89 కోట్ల విలువైన సొత్తును ఎన్ఫోర్స్మెంట్ సంస్థలు సీజ్ చేశాయి. స్వాధీనం చేసుకున్న వాటిలో రూ.127.67 కోట్ల నగదు, రూ.106.3 కోట్ల విలువైన మద్యం, రూ.184.83 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు ఉన్నాయి. వీటితో పాటు రూ.215.19 కోట్ల విలువైన బంగారు, వెండి వంటి లోహాలు, మరో రూ.437.97 కోట్ల విలువైన ఉచిత వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలను ప్రలోభాలు లేకుండా నిర్వహించేందుకు రెండు రాష్ట్రాల్లో కలిపి 5,011 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, 5,363 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను మోహరించారు. తనిఖీల సమయంలో సామాన్య పౌరులకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించిన ఎన్నికల సంఘం, నిబంధనల ఉల్లంఘనలపై సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించింది.

# పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది.. మృతులకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని నివాళులు



జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ్ ఉగ్రదాడికి నేటితో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. ఈ పిరికిపంద చర్యలో ప్రాణాలు కోల్పోయిన అమాయకుల జ్ఞాపకాలు దేశ ప్రజలందరి మదిలో ఇంకా సజీవంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ హేయమైన చర్యలో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల దేశం యావత్తు సంతాపం తెలుపుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా తుదముట్టించేందుకు భారత్ దృఢ సంకల్పంతో ఉందని స్పష్టం చేశారు. బాధితుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అమానవీయమైన ఇలాంటి దాడులు దేశ శాంతిని, ఐక్యతను ఏమాత్రం చెదరగొట్టలేవని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. బాధితుల కుటుంబాల బాధలో దేశం పాలుపంచుకుంటోందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ వెనకడుగు వేయదని తెలిపారు. భారత్ ఏనాటికీ ఉగ్రవాదానికి తలవంచదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదుల కుతంత్రాలు ఎప్పటికీ నెరవేరవని, అమాయకుల ప్రాణాలు తీసిన ఆ ఘోర ఉగ్రదాడిని దేశం ఎన్నటికీ మరచిపోదని అన్నారు. బాధిత కుటుంబాలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దశాబ్దాలుగా సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్న భారత్, ఇప్పుడు మరింత దృఢంగా, నిర్ణయాత్మకంగా స్పందిస్తోందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. దేశ ఐక్యతకు భంగం కలిగించే ఏ ప్రయత్నాన్నైనా తిప్పికొడతామని హెచ్చరించారు. ఉగ్రవాదం మానవాళికి పెద్ద శత్రువని, ఉగ్రవాదాన్ని పెంచి పోషించే వారిపై తమ ప్రభుత్వం సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనపై అంతర్జాతీయ స్థాయిలోనూ భారత్ తన గళాన్ని వినిపిస్తోందని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. దేశ ప్రజల గుండెల్లో ఈ దాడి గాయం ఇంకా మానలేదని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా సంఘీభావం ప్రకటించిన యూరోపియన్ యూనియన్



జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ్ ఉగ్రదాడి జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా యూరోపియన్ యూనియన్ భారత్కు తన సంఘీభావాన్ని ప్రకటించింది. గతేడాది ఏప్రిల్ 22న జరిగిన ఈ ఘోరదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది బాధితులను స్మరించుకుంటూ ఈయూ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. ఈ కష్టకాలంలో భారత ప్రజలకు అండగా ఉంటామని స్పష్టం చేసింది. మరోవైపు ఢిల్లీలోని బ్రిటిష్ హైకమిషన్ కూడా బాధితులకు నివాళులర్పించింది. శాంతి, భద్రతల పరిరక్షణలో భారత్తో కలిసి పనిచేస్తామని యునైటెడ్ కింగ్డమ్ వెల్లడించింది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ఉగ్రవాదులు జరిపిన ఈ దాడిలో ఎక్కువగా పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తర్వాత భారత సైన్యం పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని 'ఆపరేషన్ సింధూర్' చేపట్టిన సంగతి తెలిసిందే.

## రాష్ట్ర పౌరులందరికీ డిజిటల్ హెల్త్ కార్డుల పంపిణీ: మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికి తమ ప్రభుత్వం డిజిటల్ హెల్త్ కార్డు లు ఇస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఇప్పటి వరకు రైతులకు పంట పెట్టుబడి సాయంగా లక్ష 20 వేల కోట్లు అందించామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో దామోదర రాజనర్సింహ ప్రసంగిస్తూ.. ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. వర్గపోరుకు తావు లేకుండా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రతీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేశామని తెలిపారు. వెనకబడిన జహీరాబాద్ - నారాయణ ఖేడ్ అస్పత్రులకు త్వరలోనే 50 అదనపు బెడ్స్ మంజూరు చేస్తామన్నారు. సింగూర్ ప్రాజెక్టు టూరిస్ట్ హబ్ గా మార్చడం ద్వారా 300 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. నిమ్జ్ లో పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి పెంచుతున్నామని..విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి దిశగా సీఎం నిర్ణయాలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లాలోని నియోజకవర్గ వర్గాల ముఖ్యనేతలు హాజరయ్యారు. -

## చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల ద్వారా మహిళా సాధికారతే మోదీ లక్ష్యం: ఎంపీ సంబిత్ పాత్ర

లోక్‌సభలో, రాజ్యసభలో 33%మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా మహిళా స్వశక్తికరన్‌ను సాధించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కలను ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని లోక్‌సభ ఎంపీ బిజెపి జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ సంబిత్ పాత్ర అన్నారు. 1996లో దేవగడ ప్రభుత్వంలో బిజెపి మహిళా బిల్లును సపోర్ట్ చేసిందని, మాజీ ప్రధాని వాజ్పేయి కాలంలో సైతం నాలుగు సార్లు బిల్లు ప్రవేశపెట్టిన ప్రతిపక్షాల వల్ల బిల్లు పాస్ అవలేదని అన్నారు. నల్గొండ బిజెపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గత 30 సంవత్సరాల నుంచి పార్లమెంట్లో మహిళా బిల్లు ఆమోదించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి కానీ కాంగ్రెస్ వారి మిత్రపక్షాలు ప్రతిసారి ఏదో ఒక సాకు చెప్పి అడ్డుకుంటున్నారని అన్నారు.

## హైదరాబాద్‌లోని విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న షాపుల్లో పోలీసుల తనిఖీలు

'ఆపరేషన్ సేఫ్ స్కూల్'లో భాగంగా హైదరాబాద్‌లోని విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న షాపుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థల పరిసరాలను వ్యసన రహితంగా తీర్చిదిద్ది, చిన్నారులు పెడదోవ పట్టకుండా చూడాలనే సంకల్పంతో ఈ ప్రత్యేక సోదాలను చేస్తున్నారు. విద్యాసంస్థల సమీపంలో లభించే పొగాకు ఉత్పత్తుల వల్ల విద్యార్థులు ఆల్కహాల్, డ్రగ్స్ లాంటి పదార్థాలకు అలవాటుపడే ప్రమాదం ఉండడంతో ఈ విష వలయాన్ని ప్రాథమిక దశలోనే తుంచివేసేందుకు పోలీసులు ఈ కఠిన చర్యలకు ఉపక్రమించారు. 5 వేల మంది సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ చేపట్టిను పోలీసులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న 558 షాపుల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. లాభమే పరమావధిగా భావిస్తున్న కొందరు దుకాణదారులు, నిబంధనలను లెక్కచేయకుండా విద్యాసంస్థల సమీపంలో మైనర్లకు పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్నారని చెప్పారు. చట్టాన్ని అతిక్రమించి పొగాకు ఉత్పత్తులు అమ్మే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలని సూచించారు.

## భారత్ లో ఓడరేవుల ఆధునీకరణ కోసం సాగరమాల పథకం ప్రారంభం

భారతదేశ ఆర్థిక బలం కేవలం రహదారుల మీదనే కాదు, సుదీర్ఘ సముద్ర తీరాల్లో కూడా దాగి ఉంది. 11,000 కిలోమీటర్లకు పైగా సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన భారత్ లో పరిణామం పరంగా 95 శాతం, విలువ పరంగా 70 శాతం వాణిజ్యం సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోంది. ఓడరేవుల ఆధునీకరణ, జలమార్గాల అనుసంధానం, లాజిస్టిక్స్ మెరుగుపరిచేందుకు ప్రభుత్వం 2015లో సాగరమాల కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా ఓడరేవుల వద్ద సరుకు రవాణా సమయం తగ్గడమే కాకుండా, కార్గో సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఇది అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ పోటీతత్వాన్ని పెంచడంతో పాటు తీర ప్రాంత అభివృద్ధికి, ఉపాధి కల్పనకు తోడ్పడింది. ప్రస్తుతం సాగరమాల 2.0 ద్వారా 2047 నాటికి మరింత సమర్థవంతమైన, స్వయం సమృద్ధి కలిగిన, పర్యావరణ హితమైన సముద్ర వాణిజ్య వ్యవస్థను నిర్మించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేపై కేంద్ర ఎనిన్కల సంఘానికి బీజేపీ ఫిర్యాదు

## కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నేతల బృందం ఈరోజు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసింది. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్లతో కూడిన ఈ ప్రతినిధి బృందం, ఖర్గేపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘంతో భేటీ అనంతరం కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ఇలాంటి భాషను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి అవమానకరమని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని అనేక విధాలుగా బలహీనపరుస్తాయని అన్నారు. మల్లికార్జున ఖర్గేపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఖర్గే ప్రధానిని ఉగ్రవాది అని సంబోధించడం దేశ ప్రజాస్వామ్యాన్ని, ప్రజా తీర్పును అవమానించడమేనని విమర్శించారు.

## వికసిత్ భారత్ నిర్మాణంలో సివిల్ సర్వెంట్లే కీలకం: ప్రధాని మోదీ



: దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సివిల్ సర్వెంట్లు తమ ప్రతి ప్రయత్నాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా మలచుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ మేరకు దేశంలోని సివిల్ సర్వెంట్లకు ఆయన ఒక లేఖ రాశారు. నిరంతర అభ్యాసం, సామర్థ్య పెంపుదల పట్ల వారు చూపుతున్న నిబద్ధతను ప్రధాని ఈ లేఖలో కొనియాడారు. ఇటీవల ముగిసిన 'కర్మయోగి సాధన సప్తహం'లో సివిల్ సర్వెంట్లు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల ప్రధాని అభినందనలు తెలిపారు. వారం రోజుల పాటు సాగిన ఈ అభ్యాస ఉత్సవం దేశవ్యాప్తంగా ఉన్న అధికారులను ఏకతాటిపైకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. నిరంతర అభ్యాసం అనేది సానుకూల శక్తికి మూలమని తన వ్యక్తిగత అనుభవం ద్వారా తెలుసుకున్నానని మోదీ వివరించారు. ప్రస్తుత కాలంలో ఎప్పటికప్పుడు అప్డేట్ అవ్వడం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం అనేది అనివార్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో మార్పుల వేగం ఇంకా పెరుగుతుందని, ఆ వేగాన్ని అందుకోవాలంటే నిరంతర అభ్యాసం ఒక్కటే మార్గమని చెప్పారు. 21వ శతాబ్దం గొప్ప సవాళ్లతో పాటు అపారమైన అవకాశాలను కూడా తెచ్చిపెట్టిందని, ప్రతిరోజూ కొత్త సాంకేతికతలు, ఆవిష్కరణలు వస్తున్నాయని పేర్కొన్నారు. భారతదేశంపై దేశ పౌరులతో పాటు ప్రపంచ దేశాలకు కూడా గొప్ప అంచనాలు ఉన్నాయని, వాటిని అందుకునేలా ప్రభుత్వ పని సంస్కృతి ఉండాలని నొక్కి చెప్పారు. నేర్చుకోవడాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా జీవితాంతం కొనసాగే అలవాటుగా మార్చుకోవాలని సివిల్ సర్వెంట్లకు ప్రధాని మోదీ సూచించారు. ఇందుకోసం 'iGOT కర్మయోగి' వంటి ప్లాట్ఫారమ్లను విరివిగా ఉపయోగించుకోవాలని కోరారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ కాలంలో దేశ ప్రయోజనాల కోసం అత్యుత్తమ సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు.

## ధరిత్రీ దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకీ తీవ్రమవుతున్న వాతావరణ సమస్యలపై దృష్టి సారించే ఉద్దేశ్యంతో ఈ రోజు ధరిత్రీ దినోత్సవం - ఎర్త్ డే ని నిర్వహిస్తున్నారు. భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. వాతావరణ కాలుష్యం, విచక్షణా రహితంగా అడవుల నరికివేత వంటి అంశాల కారణంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతిని జీవ మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహనా కల్పిస్తూ 1970 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 22 వ తేదీన ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. “మన శక్తి, మన గ్రహం” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

## ఐటీ పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధి బృందం సమావేశం




లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఆయా రంగాల్లో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేలా నార్వే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని కోరారు. నార్వే ప్రతినిధి బృందం ఈ రోజు సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ అయింది. ఈ సందర్భంగా తెలంగాణ – నార్వే దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలను, ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, అవకాశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్లీన్ ఎనర్జీ, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఆఫ్షోర్ విండ్, క్లైమేట్ ఇన్నోవేషన్, గ్రీన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థలలో ‘నార్వే’ గ్లోబల్ లీడర్ గా కొనసాగుతోందని కొనియాడారు.

## దేశీయ ఎల్పీజీ సరఫరా సాధారణంగా ఉంది: కేంద్ర ప్రభుత్వం




దేశీయ ఎల్పీజీ సరఫరా సాధారణంగా ఉందని కేంద్రం ప్రభుత్వం తెలిపింది. న్యూఢిల్లీలో పశ్చిమ ఆసియాలోని తాజా పరిణామాలపై జరిగిన అంతర్-మంత్రిత్వశాఖల ఉమ్మడి విలేకరుల సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు, ఎల్పీజీ ధరలు పెరిగాయని తెలిపారు. అయినప్పటికీ ప్రజలపై ధరల ప్రభావం లేదన్నారు.  పశుసంవర్ధక, పాడిపరిశ్రమల శాఖ డైరెక్టర్ పూజా రస్తోగి మాట్లాడుతూ.. పశ్చిమ ఆసియా సంఘర్షణ ఉన్నప్పటికీ  భారత్ లో పాల సేకరణ, ప్రాసెసింగ్, సరఫరాకు అంతరాయం కలగలేదన్నారు. పాలు, పాల ఉత్పత్తుల ధరలు స్థిరంగా ఉన్నాయని, మార్కెట్లో ఎలాంటి అంతరాయం ఏర్పడలేదని తెలిపారు.

## మూడు రోజుల పర్యటన నిమిత్తం జర్మనీకి చేరుకున్న రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్

: భారత రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం జర్మనీ చేరుకున్నారు. మ్యూనిచ్ నుండి బెర్లిన్ చేరుకున్న ఆయనకు జర్మనీ ప్రభుత్వం ఘనస్వాగతం పలికింది. జర్మన్ వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో ఆయన ప్రయాణించగా, ఆ విమానానికి యుద్ధ విమానాలు ఎస్కార్ట్గా నిలిచాయి. బెర్లిన్ చేరుకున్న రాజ్నాథ్ సింగ్కు ఆ దేశ సైన్యం సైనిక గౌరవ వందనం సమర్పించింది. ఈ పర్యటనలో



భాగంగా రాజ్నాథ్ సింగ్ జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్తో పాటు పలువురు అగ్రనేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు 'డిఫెన్స్ ఇండస్ట్రియల్ కోఆపరేషన్ రోడ్మ్యాప్'పై సంతకాలు చేసే అవకాశం ఉంది. అలాగే, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళాల శిక్షణలో సహకారం కోసం కీలక ఒప్పందం కుదరనుంది. ముఖ్యంగా 'మేక్ ఇన్ ఇండియా' చొరవ కింద రక్షణ ఉత్పత్తుల ఉమ్మడి అభివృద్ధి, ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో జర్మనీ రక్షణ పరిశ్రమ ప్రతినిధులతో రాజ్నాథ్ సింగ్ సమావేశం కానున్నారు. ప్రజాస్వామ్య విలువలు, అంతర్జాతీయ నియమ నిబంధనలకు కట్టుబడి ఉన్న భారత్-జర్మనీ మధ్య రక్షణ రంగ సహకారం ఒక ముఖ్యమైన మైలురాయిగా మారనుంది.

## భారత పశ్చిమ తీరంలోని ప్రధాన పోర్టుల్లో 97 శాతం పడిపోయిన కంటైనర్ రవాణా





అంతర్జాతీయ అస్థిర పరిస్థితుల నేపథ్యంలో భారత పశ్చిమ తీరంలోని ప్రధాన ఓడరేవుల్లో కంటైనర్ రవాణా గణనీయంగా తగ్గింది. మార్చి 8వ తేదీన సుమారు 3,383గా ఉన్న కంటైనర్ వాల్యూమ్స్, ప్రస్తుతం కేవలం 99కి పడిపోయాయని.. ఇది దాదాపు 97 శాతం తగ్గుదల అని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ముఖేష్ మంగళ్ వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పోర్టు కార్యకలాపాలు సాధారణంగానే సాగుతున్నప్పటికీ, యార్డ్ ఆక్యుపెన్సీ తగ్గినట్లు పేర్కొన్నారు. సముద్ర ప్రాంతాల్లో ఉన్న భారతీయ నావికులందరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఇదే సమయంలో సముద్ర వాణిజ్యానికి రక్షణ కల్పించేందుకు కేంద్ర కేబినెట్ 'భారత్ మెరైన్ ఇన్సూరెన్స్ పూల్' ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని.. ఇందుకోసం రూ.12,980 కోట్ల సావరిన్ గ్యారెంటీ ఫండ్ను అందుబాటులోకి తెచ్చామని ముఖేష్ మంగళ్ వివరించారు. దీనివల్ల నౌకాయాన రంగంలో బీమా సమస్యలు తొలగి వాణిజ్యం నిరంతరాయంగా సాగే అవకాశం ఉందని వెల్లడించారు.

## ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిన తెలంగాణ ప్రభుత్వం

ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల 1 నుంచి 31 వరకు బదిలీలకు షెడ్యూల్ ప్రకటించింది. మూడు సంవత్సరాలు ఒకే చోట పని చేస్తున్న వారి బదిలీలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఒకే చోట నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగులను తప్పనిసరి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది. కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగులను బదిలీ చేయనున్నట్లు తెలిపింది. స్పౌజ్, వితంతువు, వచ్చే ఏడాది మే 31లోగా రిటైర్ అయ్యే వారు, 70 శాతానికి మించి వైకల్యం ఉన్న వారు మానసిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు ఉన్న వారు, క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీ, లివర్ ట్రాన్స్ ప్లాంట్, ఓపెన్ హార్ట్ సర్జరీ, ఎముకల టీబీ ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పిస్తారు.

## భారత సీడీఎస్ పేరుతో ప్రచారంలో ఉన్న వీడియో పూర్తిగా ఫేక్: కేంద్ర ప్రభుత్వం





భారత చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) పేరుతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఒక వీడియోపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్పు ఉద్దేశించి సీడీఎస్ హేళన చేస్తూ వ్యాఖ్యలు చేశారంటూ ప్రచారంలో ఉన్న ఆ వీడియో పూర్తిగా నకిలీదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ యూనిట్ స్పష్టం చేసింది. భారత సీడీఎస్ అలాంటి వ్యాఖ్యలు ఏవీ చేయలేదని, ఆ వీడియోను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో సృష్టించిన 'డీప్ఫేక్' అని నిర్ధారించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రచార ఖాతాల ద్వారా ఈ వీడియోను ఉద్దేశపూర్వకంగా వైరల్ చేస్తున్నట్లు పీఐబీ వెల్లడించింది. సోషల్ మీడియాలో వచ్చే ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు అధికారిక మూలాల ద్వారా ధృవీకరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## భారత్ ఆహార శుద్ధి రంగంలో విప్లవం.. పీఎల్ఐ పథకం ద్వారా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు

భారతదేశ ఆహార శుద్ధి రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' కీలక పాత్ర పోషిస్తోంది. దేశీయ తయారీ సామర్థ్యాన్ని, ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకం మంచి ఫలితాలను సాధిస్తోంది. ముఖ్యంగా విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యం, చిరుధాన్యాల ఉత్పత్తులపై దృష్టి సారించడం వల్ల ఈ రంగంలో సమ్మిళిత వృద్ధి కనిపిస్తోంది. 2020 ఏప్రిల్‌లో ప్రారంభమైన ఈ పథకం.. 2021-22 నుండి 2026-27 వరకు అమలులో ఉంటుంది. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.10,900 కోట్లను వెచ్చించింది. 2026-27 నాటికి రూ.33,400

కోట్లకు పైగా విలువైన ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం.. పలు విభాగాలలో మొత్తం 165 దరఖాస్తులను మంత్రిత్వ శాఖ ఆమోదించింది. ఇవి 274 ప్రాజెక్ట్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. లబ్ధిదారులు ఈ పథకం కింద ఇప్పటివరకు రూ.920 కోట్లకు పైగా పెట్టుబడులను నివేదించారు. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,000 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను పంపిణీ చేసింది. 2026-27 నాటికి 2.5 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని భావించగా..గడువు కంటే ముందే 3.39 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించింది. ఈ పథకం కేవలం పారిశ్రామిక వృద్ధికి మాత్రమే కాకుండా, వ్యవసాయ రంగాన్ని పరిశ్రమలతో అనుసంధానించడంలోనూ సఫలమైంది. విలువల గొలుసుఅంతటా ఉపాధిని కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. భారతీయ ఆహార ఉత్పత్తులు అంతర్జాతీయ విపణిలో పోటీని తట్టుకునేలా చేయడంలో పీఎల్ఐ ఒక బలమైన పునాదిగా నిలిచింది.




## ఏప్రిల్ 21న జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం

భారతదేశం.. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించిన ఈ సువిశాల దేశాన్ని ఒక్కతాటిపై ఉంచుతూ, అభివృద్ధి పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తోంది భారత సివిల్ సర్వీసెస్. అందుకే సివిల్ సర్వీసెస్ సేవలను స్మరించుకుంటూ ఏటా ఏప్రిల్ 21వ తేదీని 'సివిల్ సర్వీసెస్ డే'గా జరుపుకొంటోంది భారతావని. నేషనల్ సివిల్ సర్వీసెస్ డే... ఇది కేవలం ఒక రోజు మాత్రమే కాదు.. దేశ సేవ కోసం తమ జీవితాలను అంకితం చేసిన వేలాది మంది అధికారుల నిబద్ధతకు నిదర్శనం. దేశంలో సివిల్ సర్వీసుల ప్రయాణం ఈ నాటిది కాదు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే వీరి సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అందుకే స్వతంత్ర భారత తొలి హోం మంత్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్.. సివిల్ సర్వీసెస్ను భారత "ఉక్కు చట్రం" గా అభివర్ణించారు. 1947 ఏప్రిల్ 21న మెట్కాఫ్ హౌస్లో జరిగిన మొదటి బ్యాచ్ ఐఏఎస్ అధికారుల సమావేశంలో ఆయన చేసిన ప్రసంగం సివిల్ సర్వీస్ అధికారులకు ఇప్పటికీ ఓ దిశానిర్దేశమే. రాజకీయాలకు అతీతంగా, దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలంటూ ఆయన ఇచ్చిన పిలుపు... నాటి నుంచి నేటి వరకు సివిల్ సర్వీసెస్ వ్యవస్థ.. దేశ సమగ్రతను కాపాడటంలో వెన్నెముకలా నిలిచింది. ఒక సివిల్ సర్వెంట్ బాధ్యత కేవలం కార్యాలయానికే పరిమితం కాదు. తుపాన్లు వచ్చినా, కరువు కాటకాలు ఎదురైనా, శాంతిభద్రతల సమస్య తలెత్తినా క్షేత్రస్థాయిలో నిలబడి పోరాడే యోధులు సివిల్ సర్వీస్ అధికారులు. దేశ భవిష్యత్తును మార్చే విద్యా, వైద్య, ఆర్థిక విధానాలను రూపొందించడంలో వీరి పాత్ర కీలకం. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందడంలోనూ వీరి పాత్ర




ఎంతో కీలకం. టెక్నాలజీని ఉపయోగించి పారదర్శకమైన పాలనను అందించడంలో యువ సివిల్ అధికారులు చూపిస్తున్న చొరవ ప్రశంసనీయం. మారుతున్న కాలంతో పాటు సివిల్ సర్వీసెస్ ముఖచిత్రం కూడా మారుతోంది. గతంలో కేవలం నియంత్రణకే పరిమితమైన అధికారులు, ఇప్పుడు ‘సులభతర జీవనం’ అందిండంలో  భాగస్వాములుగా మారుతున్నారు. ‘మిషన్ కర్మయోగి’ వంటి కార్యక్రమాల ద్వారా అధికారుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రగామిగా నిలపాలనేదే ప్రతి జిల్లా కలెక్టర్, ప్రతి పోలీస్ అధికారి, ప్రతి సచివాలయ ఉద్యోగి ఒకే లక్ష్యం కావాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు.  సివిల్ సర్వీసెస్ డేను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశవ్యాప్తంగా సేలందిస్తున్న సివిల్ సర్వీసెస్ అధికారులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధిలో, పౌర సేవలో అధికారుల అంకితభావం అభినందనీయమని ఆమె కొనియాడారు. విధానాల రూపకల్పన నుంచి వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వరకు అధికారులు పోషిస్తున్న పాత్ర కోట్లాది మంది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని రాష్ట్రపతి ప్రశంసించారు. భారతదేశం నూతన ఆకాంక్షలతో ముందుకు సాగుతున్న తరుణంలో, అధికారుల చిత్తశుద్ధి.. పౌరులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడంలోనూ, పౌరుల్లో ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని పెంచడంలోనూ సివిల్ సర్వెంట్స్ కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము  పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న పౌర సేవా అధికారులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. సుపరిపాలన, దేశ నిర్మాణం కోసం సివిల్ సర్వెంట్లు తమ సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి నుంచి విధాన రూపకల్పన వరకు అధికారులు అందిస్తున్న సేవలు భారత్ పురోగతికి దోహదపడుతున్నాయని ప్రధాని కొనియాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నితిన్ గడ్కరీ తదితర ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా అధికారుల సేవలను గుర్తుచేసుకున్నారు. నమ్మకం - సమగ్రత అనే పునాదులపై నిర్మితమైన సివిల్ సర్వీసెస్ వ్యవస్థ.. భవిష్యత్తులో మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ముందుకు సాగాలని ఆశిద్దాం. రేపటి నవ భారత నిర్మాణంలో ఈ ఉక్కు చట్రం మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుందాం.

## ఢిల్లీలో జరిగిన సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్





దేశాభివృద్ధిలో పౌర సేవ అధికారులు పోషిస్తున్న పాత్రను ఉపరాష్ట్రపతి సీ.పీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరిగిన 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరడంలో అధికారులు వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. అంకితభావం, పారదర్శకతతో కూడిన పౌర సేవలు దేశ భవిష్యత్తును మారుస్తాయని ఉపరాష్ట్రపతి ధీమా వ్యక్తం చేశారు.

## బీజేపీలో చేరిన ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరారు. ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ఆధ్వర్యంలో రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్ కాషాయ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ఎంపీలు భారతీయ జనతా పార్టీలో చేరనున్నట్లు రాఘవ్ చద్దా పేర్కొన్నారు. బీజేపీ చేరికకు ముందు రాఘవ్ చద్దా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీలోని



మూడింట రెండు వంతుల సభ్యులు ఒక వర్గంగా ఏర్పడి బీజేపీలో విలీనం కానున్నట్లు వెల్లడించారు. స్వాతి మలివాల్, హర్భజన్ సింగ్, రాజీందర్ గుప్తా, విక్రమ్ సాహ్ని బీజేపీలో చేరుతారని తెలిపారు. ప్రస్తుతం రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి మొత్తం పది మంది సభ్యులు ఉండగా.. ఏడుగురు సభ్యులు ఒకేసారి వైదొలగడం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది. రాజ్యసభలో ఆప్ ఉపనేత పదవి నుంచి రాఘవ్ చద్దాను ఆప్ తొలగించింది. చద్దా స్థానంలో ఉపనేతగా అశోక్ మిట్టల్ ను నియమించింది. ఐతే ఆయన కూడా బీజేపీ చేరారు. పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఎంపీల నిర్ణయం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ విలీన ప్రక్రియ రానున్న కొద్ది రోజుల్లో పూర్తి కానుందని రాఘవ్ చద్దా వెల్లడించారు.

# బ్యాంకింగ్ రంగానికి స్థానిక అవసరాల మధ్య సమన్వయం అవసరం: నిర్మలా సీతారామన్

ప్రపంచవ్యాప్త విస్తరణ అనేది స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉన్నప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. పుణెలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) మహారాష్ట్ర రీజనల్ లోకల్ హెడ్ ఆఫీస్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగం ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకులు పరిమాణంలో ఎంత ఎదిగినా, కస్టమర్లతో సన్నిహిత సంబంధాలను కొనసాగించడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. డిజిటల్ బ్యాంకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతలు ఈ రంగాన్ని మారుస్తున్నప్పటికీ, నేరుగా మనుషుల మధ్య జరిగే సంభాషణలు, భావోద్వేగపూరిత అవగాహనను కోల్పోకూడదని పేర్కొన్నారు. సాంకేతికత అనేది సేవలను వేగవంతం చేయడానికి మాత్రమేనని, కస్టమర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో మానవీయ కోణం కీలకమని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ బలం భారీ దేశీయ మార్కెట్, బలమైన వినియోగంపై ఆధారపడి ఉందని నిర్మలా సీతారామన్ వివరించారు. ఎగుమతులు ఆదాయ వనరులుగా కీలకమే అయినప్పటికీ, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సవాళ్లు వాటిపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ కొత్త మార్కెట్లను అన్వేషిస్తూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్న భారతీయ ఎగుమతిదారులను ఆమె అభినందించారు. దేశ ఆర్థిక వృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే వ్యవసాయం, తయారీ, సేవా రంగాలు, పర్యాటకం మరియు ఐటీ రంగాలకు నిరంతరం తోడ్పాటు అందించాలని మంత్రి తెలిపారు. ఈ ప్రక్రియలో బ్యాంకులకు ఆర్థిక భరోసా, స్థిరత్వాన్ని ఇచ్చే కీలక బాధ్యత ఉందని గుర్తు చేశారు. 'వికసిత్ భారత్ 2047' విజన్ను చేరుకోవడానికి బ్యాంకింగ్ వ్యవస్థ భవిష్యత్తు డిమాండ్లకు అనుగుణంగా మారాలని సూచించారు. ఇందుకు అవసరమైన సంస్కరణలు, సన్నద్ధతపై మార్గదర్శకత్వం వహించడానికి త్వరలో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆమె ప్రకటించారు.





## తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు

తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. హోమ్ శాఖ, నిఘా విభాగం, కొత్తగా రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీ వంటి కీలక విభాగాలకు అధికారులను కేటాయించారు. శిఖా గోయల్ హోమ్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ బాధ్యతలను దేవేంద్ర సింగ్ చౌహాన్ చేపట్టనున్నారు. షాహ్నవాజ్ ఖాసిం ఐజీపీ హోదాలో మల్టీ జోన్-II బాధ్యతలు చూస్తారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీకి తొలి పోలీస్ కమిషనర్గా తరుణ్ జోషి ఎంపికయ్యారు. డ్రగ్స్ కంట్రోల్ ఎక్సైజ్ విభాగం డీజీగా అవినాష్ మొహంతి బదిలీ అయ్యారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్గా సుమతి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎస్ఐబీ (SIB) ఇంటెలిజెన్స్ విభాగానికి కార్తికేయ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

## 21వ శతాబ్దం భారతదేశ శతాబ్దం: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్



21వ శతాబ్దం భారతదేశ శతాబ్దమని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. ఐఐటీ రూర్కీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో జితేంద్ర సింగ్ ప్రసంగిస్తూ.. 2047 నాటికి దేశ జీవ ఆర్థిక వ్యవస్థ (బయో-ఎకానమీ) ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అంచనా వేశారు. భారత్ ప్రస్తుతం జన్యుశాస్త్రం నుండి క్వాంటం కంప్యూటింగ్ వరకు, అలాగే సముద్ర గర్భం నుండి అంతరిక్షం వరకు అన్ని సాంకేతిక రంగాల్లో తన పట్టును నిరూపించుకుంటూ ముందుకు సాగుతోందని వెల్లడించారు. భారతదేశ అభివృద్ధి బాట కేవలం ఆర్థిక పురోగతిపైనే కాకుండా, నైతిక విలువలతో కూడిన నాగరికతపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. 2014లో కేవలం 10 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ రంగం.. నేడు 165 బిలియన్ డాలర్లను దాటిందని చెప్పారు. 2030 నాటికి దీనిని 300 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 2024లో ఆమోదించిన 'BioE3' (ఎకానమీ, ఎన్విరాన్మెంట్, ఎంప్లాయ్మెంట్ కోసం బయోటెక్నాలజీ) పాలసీ ద్వారా ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా అటు పర్యావరణాన్ని కాపాడుతూనే, ఇటు ఉపాధి అవకాశాలను మెరుగుపరచవచ్చని ఆయన వివరించారు.

## పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మార్పు అనివార్యం: ప్రధాని నరేంద్ర మోదీ

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మార్పు అనివార్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్లోని బారుయిపూర్లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మోదీ ప్రసంగించారు. మొదటి దశ పోలింగ్ లాగే రెండో దశలోనూ కొనసాగించి 'వికసిత్ బెంగాల్' నిర్మాణానికి సహకరించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రోత్సాహంతో జరుగుతున్న చొరబాట్ల వల్ల పశ్చిమ బెంగాల్ యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారం కేవలం రాజకీయ మార్పు ద్వారానే సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. మమతా బెనర్జీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక ప్రభుత్వమని, రాష్ట్రంలో మహిళల భద్రత నేటికీ ఆందోళనకరంగానే ఉందని విమర్శించారు. జాదవ్పూర్ యూనివర్సిటీ ప్రస్తావన తీసుకొస్తూ.. అక్కడ విద్యా కార్యకలాపాలకు ఆటంకం కలుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ వెనుకబడిన వర్గాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు కాకుండా టీఎంసీ అడ్డుపడుతోందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల అధికార పార్టీ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రధాని ఈ సందర్భంగా వివరించారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద ఈ ఒక్క జిల్లాలోనే 11 లక్షల ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని, అందులో 3 లక్షల కనెక్షన్లు ఎస్సీ, ఎస్టీ వర్గాలకే అందాయని తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న అనేక సంక్షేమ ఫలాలు నేరుగా పేదలకు చేరుతున్నాయని చెప్పారు. బెంగాల్ అభివృద్ధిని అడ్డుకుంటున్న తృణమూల్ కాంగ్రెస్కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మోదీ ఓటర్లను కోరారు.

## దేశంలో ఎల్పీజీ, ఇంధన సరఫరాకు కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం




పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా డొమెస్టిక్ ఎల్పీజీ, ఇంధన సరఫరాపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. న్యూఢిల్లీలో జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో పెట్రోలియం శాఖ కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ.. దేశంలో గ్యాస్ సిలిండర్ల సరఫరా సాఫీగా సాగుతోందని, ఎక్కడా కొరత లేదని భరోసా ఇచ్చారు. వినియోగదారులు నేరుగా డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లకుండా ఆన్లైన్ బుకింగ్ను ఎంచుకోవాలని ఆమె సూచించారు. వాణిజ్య గ్యాస్ సరఫరా ఇప్పటికే 70 శాతం పునరుద్ధరించబడిందని, ఏప్రిల్ నెలలో విక్రయాలు గణనీయంగా పెరిగాయని వివరించారు. అలాగే, సహజ వాయువు కనెక్టివిటీలో భాగంగా 5.27 లక్షల పీఎన్జీ కనెక్షన్లకు గ్యాస్ సరఫరా అందుతోందని, మరిన్ని కొత్త కనెక్షన్ల కోసం మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పెట్రోల్ మరియు డీజిల్ నిల్వలు కూడా దేశంలో పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా పెట్రోల్ బంకులు నిలిచిపోలేదని ప్రభుత్వం స్పష్టం

చేసింది. కొన్ని ప్రాంతాల్లో వదంతుల వల్ల ప్రజలు కంగారు పడి ఇంధనాన్ని నిల్వ చేసుకుంటున్నారని, అయితే అలాంటి ఆందోళన అవసరం లేదని సుజాత శర్మ పేర్కొన్నారు. డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని, క్రూడ్ ఆయిల్ నిల్వలు తగినంతగా ఉన్నాయని స్పష్టం చేశారు. రిఫైనరీలు కూడా పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నందున సరఫరాకు ఎటువంటి ఆటంకం ఉండదని భరోసా ఇచ్చారు. మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలో ఉన్న భారతీయ నావికుల భద్రతను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మన్దీప్ సింగ్ రంధావా మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, గత 24 గంటల్లో భారతీయ నౌకలకు సంబంధించి ఎలాంటి ప్రమాదాలు జరగలేదని తెలిపారు. ఇప్పటివరకు 2,700 మందికి పైగా నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చామని, డిజి షిప్పింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. విదేశీ వ్యవహారాల శాఖ కూడా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ గల్ఫ్ దేశాల్లోని భారతీయుల క్షేమ సమాచారాన్ని సేకరిస్తోందని అదనపు కార్యదర్శి అసీమ్ ఆర్.మహాజన్ పేర్కొన్నారు.

## భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పడిన మంత్రుల కమిటీ ఆర్టీసీ జేఏసీ నేతలతో చర్చలు

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పడిన మంత్రుల కమిటీ ఆర్టీసీ జేఏసీ నేతలతో చర్చలు జరుపుతోంది. కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు వెల్లడించారు. మిగిలిన 3 అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని మంత్రుల కమిటీ కోరింది. డిమాండ్ల అమలుకు లిఖితపూర్వకమైన హామీ ఇస్తేనే సమ్మె విరమణపై ఆలోచిస్తామని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. దీంతో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. చర్చలు ప్రారంభానికి ముందు డ్రైవర్ శంకర్గౌడ్ మృతి పట్ల మంత్రులు, అధికారులు, జేఏసీ నేతలు సంతాపం తెలిపారు. శంకర్ కుటుంబానికి పది లక్షల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో ప్రాణాలు తీసుకోవద్దని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.



## గత పదేళ్లలో భారత టెలికాం రంగం అద్భుతమైన వృద్ధిని సాధించింది: పెమ్మసాని చంద్రశేఖర్

భారత టెలికాం రంగం గత పదేళ్లలో అద్భుతమైన వృద్ధిని సాధించిందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన 'COAI DIGICOM సమ్మిట్ 2026'లో పాల్గొన్న ఆయన.. ప్రభుత్వం, పరిశ్రమల మధ్య సమన్వయం వల్ల ఈ రంగంలో విప్లవాత్మక

మార్పులు వచ్చాయని తెలిపారు. భవిష్యత్తులో 6G, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీలు డిజిటల్ పరివర్తనలో కీలక పాత్ర పోషించనున్నాయని పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ముఖ్యంగా 2025 ఆర్థిక సంవత్సరంలో టెలికాం రంగం స్థూల ఆదాయం రూ.3.72 లక్షల కోట్లకు చేరడం ప్రభుత్వ సంస్కరణల విజయానికి నిదర్శనమని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ బ్రాడ్బ్యాండ్ కార్యక్రమం 'భారత్ నెట్' ద్వారా 2.6 లక్షల గ్రామ పంచాయతీలను అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వేగవంతమైన 5G రోలౌట్ ద్వారా ఇప్పటికే 400 మిలియన్ల వినియోగదారులను చేరుకున్నామని, సైబర్ నేరాల నుండి రక్షణకు 'సంచార్ సాథి', 'చక్షు' వంటి పటిష్టమైన వ్యవస్థలను తీసుకువచ్చామని పెమ్మసాని గుర్తు చేశారు.

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ముగిసిన 15 రోజుల 'పోషణ్ పక్వాడ' ఉత్సవాలు

*యాంకర్ పార్ట్ : పోషణ పక్వాడ అనేది భారతదేశంలో పోషకాహార లోపాన్ని తగ్గించడానికి, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడానికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే 15 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమం. 8వ ఎడిషన్ పోషణ్ పఖ్వాడా ఏప్రిల్ 9 నుండి 23 వరకు నిర్వహించారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని వినాయకనగర్ లో పోషణ పక్వాడ ముగింపు ఉత్సవాల్లో భాగంగా గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికేట్ లను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వాతి, చైతన్య, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.* *వాయిస్ ఓవర్ : ఈ ఏడాది పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శిశువు జీవితంలోని తొలి ఆరు సంవత్సరాల్లో మెదడు వికాసాన్ని ప్రోత్సహించడం, ప్రారంభ దశ (0-3) ఏళ్లు లో మాట్లాడటం, పాటలు పాడటం వారిని ఆటల్లో భాగస్వామ్యం చేయడం తదితర కార్యక్రమాలతో మెదడు చురుకుదనం పెరుగుతుందని అవగాహన కల్పిస్తున్నామని సీడీపీఓ స్వాతి వివరించారు. గ్రాడ్యుయేషన్ డే కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇది తొలి అడుగు అన్నారు. చిన్నారులకు పునాది దశలోనే మంచి అలవాట్లు, సరైన ఆహారం అందించాడం ద్వారానే ఆరోగ్యంవంతమైన సమాజాన్ని నిర్వహించగలమని పేర్కొన్నారు. అంగన్వాడి టీచర్ శ్రీదేవి మాట్లాడుతూ ఈ నెల 9 న ప్రారంభమైన పోషణ్ పక్షోత్సవ కార్యక్రమాలు నేటి వరకు వివిధ కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార పై అవగాహన కల్పించామన్నారు. చిన్నారుల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని, పోషణ్ పక్వాడ వంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో అవగాహన పెంచడానికి దోహదపడతాయన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ వారిలో పోషణ లోపంతో వచ్చే అనేక రుగ్మతలకు రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మరో టీచర్ రాణి తెలిపారు.


## ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య మరో మూడు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు



ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో మూడు వారాల పాటు పొడిగించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రెండు దేశాల ఉన్నతాధికారులతో జరిపిన చర్చల అనంతరం వైట్హౌస్లో మాట్లాడిన ట్రంప్, రాబోయే కొద్ది వారాల్లో ఇజ్రాయెల్ ప్రధాని, లెబనాన్ అధ్యక్షుడు అమెరికా పర్యటనకు వచ్చే అవకాశం ఉందన్నారు. మూడు వారాల పాటు కాల్పులు జరపకూడదని

ఇరుపక్షాలు అంగీకరించాయని, అయితే హిజ్బుల్లా అంశాన్ని ఇంకా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. హిజ్బుల్లా ముప్పు నుండి లెబనాన్ తనను తాను రక్షించుకునేందుకు అమెరికా సహకరిస్తుందని ఆయన వెల్లడించారు.

## సార్క్ కరెన్సీ స్వాప్ ఫ్రేమ్వర్క్ కింద మాల్దీవులకు రూ.3 వేల కోట్లు డ్రా చేసుకునేందుకు భారత్ ఆమోదం



సార్క్ కరెన్సీ స్వాప్ ఫ్రేమ్వర్క్ కింద మాల్దీవులకు రూ.3వేల కోట్లు డ్రా చేసుకునేందుకు భారత్ ఆమోదం తెలిపింది. గత ఏడాది అక్టోబర్లో తీసుకున్న 400 మిలియన్ డాలర్ల స్వాప్ సౌకర్యాన్ని మాల్దీవులు విజయవంతంగా తిరిగి చెల్లించిన రోజే ఈ కొత్త నిధుల ఒప్పందం ఖరారైంది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న అనిశ్చితి దృష్ట్యా, మాల్దీవుల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, విదేశీ మారక నిల్వలను మెరుగుపరచడానికి ఈ సాయం తోడ్పడనుంది. ఈ సందర్భంగా భారత్ ఎల్లప్పుడూ మాల్దీవులకు ఫస్ట్ రెస్పాండర్ గా ఉంటుందని, తమ నేబర్హుడ్ ఫస్ట్ విధానంలో ఆ దేశం కీలక భాగస్వామి అని భారత హైకమిషన్ పునరుద్ఘాటించింది. ప్రెసిడెంట్ ముయిజ్జు పర్యటనలో కుదిరిన ఈ ఒప్పందం, ఇరు దేశాల మధ్య ఉన్న పటిష్టమైన ఆర్థిక బంధానికి, ప్రాంతీయ సహకారానికి నిదర్శనమని మాల్దీవుల విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## అద్భుతంగా కొనసాగుతున్న 'ముఖ్యమంత్రి ప్రజావాణి' కార్యక్రమం

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న 'ముఖ్యమంత్రి ప్రజావాణి' కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలను, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రస్తుతం కలెక్టర్ల అధ్వర్యంలో జిల్లాలో ప్రతివారం ప్రజావాణి నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలన్నారు.

## ఇరాన్ ప్రజలకు సుప్రీం లీడర్ అయతుల్లా ముజ్తబా సందేశం



ఇరాన్ ప్రజల మధ్య ఉన్న అసాధారణ ఐక్యత శత్రువుల కుట్రలను దెబ్బతీసిందని సుప్రీం లీడర్ ఆయతుల్లా సయ్యద్ ముజ్తబా హొస్సేనీ ఖమేనీ కొనియాడారు. ఈ ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రజలు ఆచరణాత్మక చర్యల ద్వారా తమ కృతజ్ఞతను చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేందుకు శత్రువులు చేస్తున్న మీడియా ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. దేశ నాయకత్వంలో ఎలాంటి చీలికలు లేవని, హార్డ్లైనర్లు, మోడరేట్లు అనే తేడా లేకుండా అందరూ ఐక్యంగా ఉన్నారని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాల నుండి ఒత్తిళ్లు ఎదురవుతున్న తరుణంలో, తామంతా సుప్రీం లీడర్ మార్గదర్శకత్వంలో ఐక్యంగా ఉండి దురాక్రమణదారులకు బుద్ధి చెబుతామని ప్రకటించారు.

## బిసిల అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్ లో 50 వేల కోట్లు

: బిసిల అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్ లో అత్యధికంగా 50 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. విజయవాడలో శెట్టిబలిజ సంఘం నిన్న నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. బిసి కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. త్వరలోనే అవసరమైన చోట చేతి వృత్తుల వారికి వర్క్ షాపు ఏర్పాటు చేస్తామన్నారు. తాజాగా మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆర్థికంగా తోడ్పాటు అందించినట్లు చెప్పారు.

## వీక్లీ ఎక్స్ ప్రెస్ ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి

నరసాపురం నుంచి హైదరాబాద్లోని చర్లపల్లి వరకు నడిచే నూతన వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలును నరసాపురం రైల్వే స్టేషన్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం, రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రైలు వల్ల హైదరాబాద్కు వెళ్లే ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు, వ్యాపారస్తులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. అలాగే నరసాపురం ప్రాంతానికి మరిన్ని రైళ్లు అందుబాటులోకి రానున్నాయని ఆయన వెల్లడించారు.

## జనగణన కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణన కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆకాశవాణి ద్వారా మనసులోని భావాలను పంచుకునే మన్ కి బాత్ 133వ సంచిక కార్యక్రమంలో జనగణనతో పాటు పలు అంశాలపై ప్రధానమంత్రి ఆదివారం ప్రసంగించారు. జనగణన 2027 పూర్తిగా డిజిటల్ రూపంలో జరుగుతోందని ఈసారి ప్రజలకు స్వీయ-గణన సౌకర్యం కూడా కల్పించారని తెలిపారు. డిజిటల్ విధానాల ద్వారా సమాచార భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా, భద్రంగా ఉంటుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

## భారత్ విజ్ఞాన శాస్త్రాన్ని దేశ అభివృద్ధితో అనుసంధానం

భారత్ విజ్ఞాన శాస్త్రాన్ని దేశ అభివృద్ధితో అనుసంధానిస్తూ ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన్ కి బాత్ కార్యక్రమంలో పౌర అణు కార్యక్రమం గురించి ప్రస్తావించారు. పారిశ్రామిక వృద్ధి, ఇంధన ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ వంటి కీలక రంగాలకు గణనీయమైన తోడ్పాటును అందించేందుకు దేశ శాస్త్రవేత్తలు పౌర అణు కార్యక్రమాన్ని విజయవంతంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రైతుల నుంచి ఆధునిక ఆవిష్కర్తల వరకు అన్ని వర్గాలకు పౌర అణు కార్యక్రమం ఉపయోగపడుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

## ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవం

ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. మేథో హక్కులు, కాపీ రైట్లు, ట్రేడ్ మార్కులు, డిజైన్లు నిత్య జీవితంలో ఎటువంటి ప్రాముఖ్యం కలిగి ఉంటాయో తెలియచేసే ఉద్దేశ్యంతో ప్రపంచ మేథో హక్కుల సంఘం ప్రతి ఏటా ఏప్రిల్ 26వ తేదీన ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం 2000 సంవత్సరంలో ప్రారంభించింది. ఆవిష్కర్తలు, సృజనశీలురు ప్రపంచ వ్యాప్తంగా వివిధ సమాజాలకు అందించిన మేధస్సును ఈ రోజు గుర్తించడం ఆనవాయితీ.

## తెలంగాణలో ఆదివారం నుంచి స్వీయ గణన కార్యక్రమం

జనగణన-2027లో భాగంగా తెలంగాణలో ఆదివారం నుంచి స్వీయ గణన కార్యక్రమం ప్రారంభం కానుందని జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హొళికెరి తెలిపారు.హైదరాబాద్లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె శనివారం పాత్రికేయులతో మాట్లాడారు. సెల్ఫ్ఎన్యూమరేషన్ ప్రక్రియ ఆదివారం నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇది అని పేర్కొన్నారు. ప్రజలు se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా స్వచ్ఛందంగా జనగణనకు తమ వివరాలను అందించవచ్చని తెలియశారు

## కర్ణాటకలోని ఉడిపిలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యువెలరీ నూతన ప్రాంగణాన్ని ప్రారంభించిన నిర్మలా సీతారామన్

కర్ణాటకలోని ఉడిపిలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యువెలరీ (IIGJ) నూతన ప్రాంగణాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఈ నూతన శిక్షణ సంస్థ యువత, యువ పారిశ్రామికవేత్తలకు వృత్తిపరమైన శిక్షణ అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రత్నాలు, ఆభరణాల రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణులను తయారు చేయడం ద్వారా దేశ ఆర్థిక వృద్ధికి ఈ సంస్థ తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఇన్స్టిట్యూట్




41 రకాల ఆధునిక ఆభరణాల తయారీ యంత్రాలు, క్యాడ్, కాస్టింగ్, టెస్టింగ్, ఫినిషింగ్ మెషినరీతో పాటు పూర్తి స్థాయి ప్రొడక్షన్ లైన్ సౌకర్యాలతో అత్యాధునికంగా రూపొందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ల్యాబ్-గ్రోన్ డైమండ్ టెక్నాలజీస్లో ప్రత్యేక పరిశ్రమ ఆధారిత సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ కోసం ఐఐజీజే, ఐఐటీ మద్రాస్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై సంతకాల ప్రక్రియను నిర్మలా సీతారామన్ వీక్షించారు. ఈ ఒప్పందం ద్వారా కృత్రిమ వజ్రాల తయారీ సాంకేతికతలో వినూత్న మార్పులు రానున్నాయని ఆమె వివరించారు.

## దేశీయంగా ఇంధన ధరల పెంపు ఆలోచన లేదు: కేంద్రం

అంతర్జాతీయంగా ముడిచమురు మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతున్నప్పటికీ.. దేశీయంగా ఇంధన ధరలు స్థిరంగా ఉంటాయని కేంద్ర పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది. దిల్లీలో జరిగిన అంతర్ మంత్రిత్వ శాఖల విలేకరుల సమావేశంలో జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండబోదని, ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల దిగుమతులపై కొంత ప్రభావం పడినప్పటికీ.. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ, పీఎన్జీ, రవాణా రంగానికి అవసరమైన సీఎన్జీ సరఫరా వంద శాతం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. వాణిజ్య అవసరాలకు సరఫరాను 70 శాతానికి పునరుద్ధరించినట్లూ, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, ఔషధ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. వలస కూలీలు వినియోగించే 5 కిలోల ఎల్పీజీ సిలిండర్ల సరఫరాను ప్రభుత్వం రెట్టింపు చేసిందన్నారు. పరిస్థితులను నిరంతరం గమనిస్తున్నట్లూ, సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

## పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను జౌళి శాఖ నిశితంగా గమనిస్తోంది: బిపిన్ మీనన్

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను జౌళి శాఖ నిశితంగా గమనిస్తోందని ఆ శాఖ ట్రేడ్ అడ్వైజర్ బిపిన్ మీనన్ తెలిపారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ పరంగా ఎదురవుతున్న అంతరాయాలను అధిగమించేందుకు ఎగుమతిదారులు జెడ్డా లాంటి ప్రత్యామ్నాయ ఓడరేవులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఇంధనం, గ్యాస్ సరఫరా సగటు వినియోగంలో 80 శాతం వరకు స్థిరంగా ఉందని వివరించారు. షిప్పింగ్ శాఖ డైరెక్టర్ ముఖేష్ మంగళ్ మాట్లాడుతూ.. ఆ ప్రాంతంలోని భారతీయ నావికులంతా సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేశారు. గత 24 గంటల్లో భారతీయ నౌకలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని వెల్లడించారు. సముద్ర మార్గాల్లో ఉన్న నావికులు క్షేమంగా తిరిగి వచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలను మంత్రిత్వ శాఖ చేపడుతోందని భరోసా ఇచ్చారు.

## తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం: జూపల్లి కృష్ణారావు

తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మౌలిక వసతుల కల్పన, గమ్యస్థానాల బ్రాండింగ్, విస్తృత ప్రచార కార్యక్రమాలకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లో నిర్వహించిన పర్యాటక సలహా కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని వారసత్వ సంపద, సంస్కృతి, అద్భుతమైన కట్టడాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు, జల వనరులు, దట్టమైన అడవులు, ఆధ్యాత్మిక కేంద్రాలను సమన్వయం చేస్తూ తెలంగాణను ఒక శక్తివంతమైన పర్యాటక హబ్గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు కనీస సౌకర్యాల కల్పనలో రాజీ పడకూడదని కూడా మంత్రి అధికారులకు చెప్పారు.

## తెలంగాణ తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్ నియామకం




తెలంగాణ రాష్ట్ర తదుపరి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్రెడ్డి ఈ నెల ఉద్యోగ విరమణ చేయనున్నారు. మే 1వ తేదీన సీవీ ఆనంద్ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం హోం శాఖలో ఉన్న ఆయనను బదిలీ చేసి, డీజీపీగా ఎంపిక చేసినట్లు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సి వి ఆనంద్ గతంలో, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, అంటీ-కరప్షన్ బ్యూరో డైరెక్టర్, గ్రేహౌండ్స్ దళంలో కీలక బాధ్యతలతో పాటు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ గా కీలక బాధ్యతలు నిర్వహించారు.

## విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా హబ్కు భూమిపూజ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ఆంధ్రప్రదేశ్లో ఐటీ హబ్గా విరాజిల్లుతున్న విశాఖపట్నం.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా అవతరించబోతోంది. ప్రతిష్ఠాత్మక గూగుల్ సంస్థ విశాఖలో భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో గ్లోబల్ టెక్ మ్యాప్లో ఆంధ్ర ప్రదేశ్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. సుమారు లక్షా 35 వేల కోట్ల పెట్టుబడితో ఈ మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. విశాఖ జిల్లా తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా హబ్కు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్తో పాటు గూగుల్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, అదానీ గ్రూప్ ప్రతినిధి జీత్ అదానీ, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ సెంటర్.. ఆసియాలోనే అతిపెద్ద డేటా హబ్లలో ఒకటిగా నిలవనుంది. సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో మూడు ప్రాంతాల్లో ఈ డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. సెర్చ్ ఇంజిన్గా మొదలైన గూగుల్ ప్రయాణం.. ఇప్పుడు విశాఖ వేదికగా దేశానికే గ్రోత్ ఇంజిన్గా మారనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షా 88 వేల ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా నిర్మాణ దశలోనే 60 వేల మందికి ఉపాధి దక్కనుంది. విశాఖ ముఖచిత్రాన్ని మార్చబోతున్న ఈ ప్రాజెక్టు కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదు.. గ్లోబల్ కనెక్టివిటీకి ఇది గేట్వేగా మారుతుందని అంచనాలున్నాయి. విశాఖ తీరం నుంచి మూడు అంతర్జాతీయ సముద్ర గర్భ కేబుళ్లు అందుబాటులోకి రాబోతున్నాయి. ఇవి ఆస్ట్రేలియా, యూరప్, అమెరికా, ఆఫ్రికా ఖండాలను అనుసంధానిస్తాయి. దీనివల్ల డేటా వేగం పెరగడమే కాకుండా అంతర్జాతీయ కంపెనీలు విశాఖలో పెట్టుబడులు పెట్టే అవకాశం కూడా ఉంటుంది. అమరావతి నుంచి హైదరాబాద్కు బుల్లెట్ రైలు, జూన్ 1న ప్రారంభం కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ వంటి కీలక నిర్ణయాలతో విశాఖ ఇకపై 'ఐటీ పట్నం' నుంచి 'ఏఐ పట్నం'గా పరివర్తన చెందనుంది. శంకుస్థాపన సందర్భంగా కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ లో డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల అభివృద్ధి పరుగులు తీస్తోందని కొనియాడారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 800 కోట్ల రైల్వే నిధులు వస్తే.. ఇప్పుడు ఒక్క ఏపీకే 10 వేల కోట్లకు పైగా నిధులు అందుతున్నాయని గుర్తుచేశారు. గూగుల్ వంటి సంస్థ రాకతో సెమీకండక్టర్ తయారీలోనూ రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖను ఇక నుంచి ఏఐ పట్నంగా పిలవాలని కేంద్రమంత్రి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఈ రోజు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గూగుల్ రాక విశాఖకే కాదు.. ఏపీ మొత్తానికి గేమ్ ఛేంజర్ అని అభివర్ణించారు. 2028 సెప్టెంబర్ నాటికి ఈ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి చేసి ఆవిష్కరిస్తామని స్పష్టం చేశారు. అలాగే సుపరిపాలనలో గూగుల్ ఏఐ అసిస్టెంట్ సహాయం తీసుకోబోతున్నట్లు ప్రకటించారు. గూగుల్ సంస్థ ప్రతినిధులు సైతం విశాఖ మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డేటా సెంటర్ను నిర్మించి దేశ ఆర్థిక ప్రగతిలో పాలుపంచుకుంటామన్నారు. ఈ సందర్భంగా గూగుల్ గ్లోబల్ ఇన్ ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే మాట్లాడుతూ... దేశంలో తమ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెతద్యం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏఐ రంగంలో విశాఖ ఒక గ్లోబల్ డెస్టినీగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విశాఖ జిల్లా తర్లువాడలో గూగుల్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్ ప్రారంభం




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ జిల్లా తర్లువాడలో ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన 'గూగుల్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్' కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శంకుస్థాపన చేశారు. గూగుల్ సంస్థ, అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ట్రా భాగస్వామ్యంతో సుమారు లక్షా 35వేల కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖ పట్నం.. ఏఐ పట్నంగా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి వివక్ష చూపడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్న ఆరోపణలను అభివృద్ధితో తిప్పికొడుతున్నామని, బుల్లెట్ రైళ్ల రాకతో దక్షిణాది రాష్ట్రాల ముఖ చిత్రం మారబోతోందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. గూగుల్ వంటి సంస్థలు భారత్ లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం శుభపరిణామమని, కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మారుతున్న కాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకంగా మారిందని, ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్గా ఇప్పుడు భారత్ను ప్రపంచం గుర్తిస్తోందన్నారు. ఎలక్ట్రానిక్స్ సరఫరా గొలుసులో ఇప్పుడు భారత్ కీలకపాత్ర పోషిస్తోందని, సెమీ కండక్టర్ల తయారీలోనూ ఇండియా సత్తా చాటుతోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు దానికి తగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదు: రాజ్ నాథ్ సింగ్

ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు దానికి తగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ హెచ్చరించారు. కిర్గిస్థాన్లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో కేంద్ర

మంత్రి మాట్లాడారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని రాజ్ నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గతేడాది జమ్మూకశ్మీర్, పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని రాజ్నాథ్ సింగ్ ప్రస్తావించారు. ఈ ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందన్నారు. దీని అనంతరం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందన్నారు.



## న్యూఢిల్లీలో 'సుస్థిర భవిష్యత్తు కోసం కీలక ఖనిజాల అభివృద్ధి' సదస్సు

పరిశుభ్రమైన ఇంధనం, అధునాతన సాంకేతికత, ఆర్థిక పునరుత్తేజాలకు కీలకమైన ఖనిజాల భద్రత కోసం దేశం తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోందని కేంద్ర గనుల శాఖ కార్యదర్శి పీయూష్ గోయల్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన 'సుస్థిర భవిష్యత్తు కోసం కీలక ఖనిజాల అభివృద్ధి' సదస్సులో ఆయన ప్రసంగించారు.



ఖనిజాన్వేషణ, వేలం, ప్రాసెసింగ్ రీసైక్లింగ్ లాంటి విభాగాలలో సంస్కరణలతో దీర్ఘకాలిక సరఫరాను నిర్ధారించడమే జాతీయ కీలక ఖనిజాల మిషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో వందలాది అన్వేషణ ప్రాజెక్టులు చేపట్టినట్లు, ఖనిజ బ్లాకుల వేలం గణనీయంగా పెరిగిందని గుర్తుచేశారు. దేశీయ ప్రాసెసింగ్ సామర్థ్యం అవసరాలను వివరిస్తూ...సేకరించిన ఖనిజాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ అమలవుతోందని పీయూష్ గోయల్ చెప్పారు.


## సమాజాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు విద్య అత్యంత కీలకం: మంత్రి అజారుద్దీన్

విద్య సమాజాభివృద్ధికీ, విద్యార్థుల భవిష్యత్తుకూ అత్యంత కీలకమని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సంఘం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఒక సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల కలలు సాకారం అయ్యే కేంద్రాలుగా మారాలని సూచించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలు, జేఈఈ మెయిన్స్

2026లో TGMREI విద్యార్థులు చూపిన ప్రతిభ పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, మెడిసిన్, ఇంజనీరింగ్, సివిల్ సర్వీసెస్ లాంటి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో క్రమశిక్షణ, భద్రత, ఉత్తమ బోధనా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.




## అంతర్జాతీయ డ్రగ్ మాఫియా డాన్ సలీం డోలా భారత్కు అప్పగింత.. హర్షం వ్యక్తం చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా



అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడు, అంతర్జాతీయ మాదకద్రవ్యాల స్మగ్లర్ మహ్మద్ సలీం డోలాను ఈరోజు తెల్లవారుజామున భారత్కు తీసుకువచ్చారు. 'ఆపరేషన్ గ్లోబల్-హంట్' పేరుతో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో చేపట్టిన ఈ ఆపరేషన్ పెద్ద విజయమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభివర్ణించారు. తుర్కియే నుండి అతడిని రప్పించడంలో భారత ఏజెన్సీలు విజయం సాధించాయని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం డ్రగ్ కార్టెల్లను నిర్మూలించడంలో ఎంత కఠినంగా ఉందో ఈ అరెస్ట్ నిరూపిస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడి విదేశాలకు పారిపోయిన నేరస్థులందరినీ చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. గ్లోబల్ నెట్వర్క్ ద్వారా భారత నిఘా సంస్థలు సరిహద్దులు దాటి నేరగాళ్లను పట్టుకుంటున్నాయని కొనియాడారు. ఢిల్లీలోని ఐజీఐ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఎన్సీబీ అధికారులు సలీం డోలాను ఆధీనంలోకి తీసుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా సలీం డోలా మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా, యూరోప్ దేశాల వరకు విస్తరించిన భారీ డ్రగ్ సిండికేట్ను నడుపుతున్నాడు. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో పట్టుబడిన భారీ పరిమాణంలోని హెరాయిన్, చరాస్, మెఫెడ్రోన్, మెథాంఫెటమైన్ కేసుల్లో ప్రధాన నిందితుడు. భారత్లోని చిన్న చిన్న డ్రగ్ విక్రయదారులకు సలీం డోలా హోల్సేల్ సప్లయర్గా పనిచేస్తున్నాడు. 2025లో ఆయన కుమారుడు తాహిల్ సలీం డోలా, ఇతర అనుచరులను యూఏఈ నుండి బహిష్కరించిన తర్వాత ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పుడు తుర్కియే అధికారులు, ఇంటర్పోల్, భారతీయ ఏజెన్సీల సమన్వయంతో సలీం డోలాను రప్పించారు.

## దేశ రవాణా వ్యవస్థలను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మార్చుకోవాలి: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ




పౌరులకు సురక్షితమైన, సమర్థవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాలను అందించాలంటే దేశం తన రవాణా వ్యవస్థలను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మార్చుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన బస్వరల్డ్ ఇండియా కాన్క్లేవ్ 2026లో ప్రసంగిస్తూ.. దేశంలోని రవాణా రంగం దృష్టి ఇకపై కేవలం ఖర్చుకే పరిమితం కాకుండా, నాణ్యత, సౌకర్యం వైపు మళ్లిందన్నారు. దేశవ్యాప్తంగా నాణ్యమైన రహదారుల అభివృద్ధి ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించి, అనుసంధానాన్ని మెరుగుపరిచిందని పేర్కొన్నారు. గతంలో 8 నుంచి 9 గంటల సమయం పట్టే ఢిల్లీ, డెహ్రాడూన్ మధ్య ప్రయాణాన్ని ఇప్పుడు సుమారు రెండు గంటల్లోనే పూర్తి చేయవచ్చని గడ్కరీ చెప్పారు. వేగవంతమైన, సురక్షితమైన, పర్యావరణ అనుకూలమైన రవాణాను ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా 36 గ్రీన్ ఎక్స్ప్రెస్ హైవేలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## మత్స్య సంపద ఎగుమతుల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం: రాజీవ్ రంజన్ సింగ్

మత్స్య సంపద ఎగుమతుల్లో 11 నుంచి 30 శాతం మేర అభివృద్ధి సాధిస్తామని కేంద్ర మత్స్య ,పశు సంపద శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ పేర్కొన్నారు.ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ రాజేంద్ర నాగర్ లోని జాతీయ మత్స్య సంపద బోర్డు ఎన్.ఎఫ్. డి.బి లో ఆయన అధికారులతో సమీక్ష జరిపారు.కోస్తా ప్రాంతాల్లో మత్స్య సంపద అభివృద్ధిపై అధికారులతో చర్చించారు.అనంతరం ఆయన దూరదర్శన్ తో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు రాబోయే రోజుల్లో మత్స్య సంపద లో మరింత వృద్ధి సాధిస్తామన్నారు.ఇందుకోసం దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు బైట్ కాగా తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార పశు సంపద అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.దాదాపు గంటన్నరకు పైగా ఆయన సమావేశం. అయ్యారు.అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం కావాలన్నారు.మత్స్య సంపద అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయలన్నారు. తెలంగాణ లో అధిక భాగం చెరువుల్లో చేపల పెంపకాన్ని చేపట్టామని అందుకు కేంద్ర సహకారం కూడా అవసరమన్నారు

# కాశీమజిలీ కథలు




డా. మాదిరాజు బ్రహ్మానంద రావు

కాశీమజిలీ కథలు-ఏడవ భాగం

కళావతిని ఏ విధంగానైనా తెచ్చి ఇస్తానని కందర్ప కేతువునకు వాగ్దానం చేసిన వృద్ధస్త్రీ ఒక ఓడ మీద బయలుదేరింది. ఆమె వెదుకుతున్న కళావతి ఎక్కడ ఉందో ఆ ముసిలిదానికి తెలియదు. అది గుడ్డిగా కళావతి చేతి ఉంగరాన్ని మింగిన చేప ఉన్న దిక్కు నకు బయలుదేరింది. ఈ విధంగా పదిహేనురోజులు ప్రయాణం చేసిన తరువాత ఆమె కళావతి వసంతులు ఉన్న పట్టణానికి చేరుకొంది. ఓడ దిగి ఆమె చుట్టూ పరిశీలించి చూడగా అమెకు ఒక యువజంట కనిపించింది. వారే కళావతీ వసంతులు. వారిని చూచి ఆమె పెద్దగా ఏడవ సాగింది. ఆమె ఏడుపు విని అక్కడకు వచ్చిన కళావతి వసంతులు ఆమెను ఎందుకు ఏడుస్తున్నావని అడగ్గా- ఆమె లేనిపోని కథలల్లి ఇట్లా చెప్పసాగది. "నాకో కొడుకున్నాడు. వాడికి పెళ్లి చేశాను వాళ్ళిద్దరూ కలిసి నాపై పగను పెంచుకొని ఒకరోజు నన్నీ సముద్రంలో పడేస్తే ఇక్కడికి కొట్టుకొచ్చాను" అంటూ దొంగ ఏడుపులు ఏడవ సాగింది. ఆమెపై జాలి పడి 'నిర్మానుష్యమైన ప్రదేశంలో తమకోతోడు దొరికిందని-ఆమె తమకో పెద్ద దిక్కుగా ఉంటుం'దనుకొని ఆ దంపతులు సంతోషంతో ఆమెను అంతఃపురానికి తెచ్చి గౌరవించసాగారు. ఆమె కూడా కొన్ని రోజులు వారికి తలలో నాలుకలాగా ఉంటూ వారిని నమ్మించింది. కొన్ని రోజులు గడచిన తరువాత ఒకరోజు ముసలిది కళావతి దగ్గరకు వచ్చి 'నీ భర్త ప్రాణాలకేదైనా ముప్పు వస్తే అతణ్ణి తామే గదా రక్షించా'లంటూ కల్లబొల్లి మాటలన్నీ చెప్పి వసంతుని ప్రాణాలెక్కడున్నాయో తెలుసుకొమ్మంది. కళావతికి తన ప్రాణాలు కత్తివరలో ఉన్నాయన్న సంగతి వసంతుడు చెప్పాడు. ఈ విషయాన్ని కళావతి ద్వారా తెలుసుకున్న ముసలిది సమయం కొరకెదురు చూస్తూ- ఒకనాడు వసంతుడు వేటకు పోయిన సమయంలో ఒక అర్ధరాత్రి కత్తివరను అరగదీయ సాగింది. దీనిని గుర్తించిన కళావతి అడ్డుకోగా ఆమెను మాయమాటలతో మోసం చేసి ఓడ ఎక్కించి తనదేశమైన వంగదేశానికి తరలింప సాగింది. ఎదిరించిన కళావతిని ఓడలో ఒక గదిలో బంధించింది. ఓడ వంగదేశానికి చేరుకోగా కళావతిని చూచిన కందర్పకేతు సంతోషించాడు. పనిని సాధించిన ముసలిదానిని మెచ్చుకున్నాడు.

కందర్పకేతు కళావతి వద్దకు వచ్చి తన కోరికను తెలిపాడు. తనను వివాహమాడమన్నాడు. నిస్సహాయురాలైన ఆమె చేసేదేమీ లేక కందర్పకేతువును మభ్యపెట్టి 'ఒక సంవత్సరం పాటు తనకో వ్రతనియమం ఉందని ఆ తరువాతనే వివాహమాడుతా'నన్నది. అందుకు కందర్పకేతువు ఒప్పుకున్నాడు. కళావతి సంవత్సరవ్రతనియమాన్ని పాటిస్తూ కందర్పకేతు చెరలో ఉండిపోయింది. వసంతని కథ కొంచెం సేపట్లా ఉంచి మఱ్ఱికొమ్మనెక్కి దక్షిణం వైపునకు వెళ్లిన రాముని కథను ఇప్పుడు చెప్పుకుందాం.




రాముని కథ

మఱ్ఱిచెట్టునెక్కి దక్షిణం వైపునకు వెళ్లిన రాముడు ఆరు రోజుల పాటు రాత్రింబవళ్లు ఆ చెట్టుపైన నడవగా ఆరవరోజున అతనికొకచోట ఒక పర్వతం కనిపించింది. అతడు కొమ్మ దిగి పర్వతాన్ని ఆరు రోజులపాటు ఎక్కగా కొండకొన ఒక గుహ కనిపించింది. సాహసంతో దాని లోపలికి పోతుంటే రాను రాను వెలుతురు మాయమై చీకటి కమ్ముకొంది. గాలి వెలుతురులు లేవు. ఆ చీకటిలో నడుస్తుంటే ఒకచోట తలుపున్నట్లు మసకగా కనిపించింది. చీకటిలో చేతితో తడవగా తలుపు గడియ తాకింది. దానిని తీయగా పెద్ద వెలుగుతో నిండిన ఒక పెద్ద గది అందులో ఒక మహర్షి తపస్సు చేస్తూ కనిపించారు. రాముని చూడంగానే మొదట మహర్షికి కోపం వచ్చినా- అతని సాహసానికి మెచ్చుకొని 'ఇక్కడికి ఎట్లా వచ్చావు' అని అడిగాడు. రాముడు తన కథంతా చెప్పుకొని తననీ కొండను దాటించమన్నాడు. ముని అతని అతడు వచ్చిన మఱ్ఱిచెట్టు మొదట్లో గాక మరోచోట పడవేశాడు. ఆ ప్రదేశంలో నడుస్తూ వెళుతుంటే చీకటి పడింది. ఒక మామిడి చెట్టు కింద అతడు సేద తీర్చుకుంటుంటే ఆ చెట్టుపైని గరుడ పక్షులు ఇట్లా మాట్లాడుకో సాగాయి. పక్షి భాష తెలిసిన రాముడు వాటి సంభాషణను వినసాగాడు అందులో ఆడపక్షి మగపక్షితో 'మీరు అనేక ప్రదేశాలు తిరుగుతుంటారు కదా ఏ దేశంలో నైనా జరిగిన విశేషమేమైనా ఉంటే చెప్ప' మని కోరింది అప్పుడు మగ పక్షి భార్యతో ''ఇక్కడకు రెండు యోజనాల దూరంలో ఒక పట్టణం ఉంది. ఆ పట్టణమేలే రాజుకు లేకలేక ఒక చక్కని కూతురు పుట్టింది. కానీ ఆమెకు కన్నులు కనిపించటం లేదు. అప్పుడు రాజు తన కుమార్తెకు కన్నులు తెప్పించిన వానికి వాడెవడైనా సరే రాజ్యం

ఇచ్చి తన కూతుర్నిచ్చి పెళ్లి చేస్తానని చాటించాడు" అప్పుడు ఆడుపక్షి మగపక్షితో 'మన గూటిలో ఉన్న పసికాష్టాన్ని అరగదీసి ఆమె కన్నులకు పట్టిస్తే కన్నులు వస్తాయి కదా' అని అంటూ ఆ పక్షులు అక్కడి నుంచి ఎగిరిపోయాయి. పక్షిసంభాషణంతా విన్న రాముడు గూటిలో ఉన్న పసికాష్టాన్ని తీసికొని ఒక రోజు ఆ పట్టణం చేరుకున్నాడు. రాజు వద్దకు వెళ్లి రా కుమార్తెను కళ్ళు తాను తెప్పిస్తానని చెప్పి పసికాష్ట గంధాన్ని ఆమె కనులకు పట్టించాడు. ఆమెకు కళ్లు వచ్చాయి. ఆమెకు చూపు రాగానే మొదటగా రాముణ్ణి చూచింది. తండ్రి వాగ్దానాన్ని అనుసరించి ఆమె రాముని పెండ్లాడింది. రాజు మంత్రికుమారుడైన రామునకు రాజ్యాభిషేకం చేసాడు.

రాజుగా రాముడు కొంతకాలం పరిపాలించిన తరువాత అతనికి తన మిత్రులు గుర్తుకు వచ్చారు. కొంత కాలం గడిచిన తర్వాత అతనికి తన మిత్రులు గుర్తుకు వచ్చారు. 'తామైదుగురు మిత్రులమేవిధంగా దేశాటనకు బయలుదేరి వచ్చామో' భార్యతో చెప్పి తన మిత్రులను కలుసుకోవటానికి వెళ్లివస్తానన్నాడు. అందుకు భార్య అంగీకరించిన తరువాత అతడో రోజు మిత్రులను వెదకుతూ గుఱ్ఱాన్నెక్కి బయలుదేరాడు. అడవిలో రోజల్లా ప్రయాణం చేసిన గుఱ్ఱం అలసిపోయింది. దానినో చెట్టుకు కట్టివేసి తాను విశ్రాంతి తీసుకోసాడు. ఇంతలో ఒక సింహం వచ్చి గుఱ్ఱాన్ని ఈడ్చుకొని వెళ్ళింది. రాముడు నడుస్తూ రాత్రి వేళకు ఒక చండీ ఆలయం దగ్గరికి వచ్చాడు. ఇంతలో ఇద్దరు దొంగలు దేవికి బలివ్వటానికి ఒక స్త్రీని గుడికి తెచ్చారు. వారిని చూసిన రాముడు దేవీవిగ్రహం మాటున దాగి ఆ దొంగల మాటలను వినసాగాడు. ఆ దొంగలు 'తామింతకుముందే తొంభైతొమ్మిదిమంది కన్యలను దేవికి బలియిచ్చామని-ఈమెతో నూరుగురు అవుతారని-చెప్పుకుం'టూ బలియిచ్చేముందాస్త్రీని చూచారు. ఆమె సౌందర్యాన్ని చూసిన వారిద్దరికి మతిభ్రమించింది. బలియిద్దామనుకున్న ఆమెపై మోహం కలిగింది. ఇద్దరు ఆమెను తానంటే తాను పెండ్లాడతామని కలహించుకోసాగారు. చివరికి వారామెను ఉదయాన్నే బలి ఇద్దామని ఒక నిర్ణయానికి వచ్చారు. మరునాడుదయం రాముడు ఆ దొంగలనిద్దరిని నిద్రలేపి తాను చండీసేవకుడనని బలి యివ్వవలసిన కన్యను చెరపటానికి సిద్ధపడిన మిమ్మల్నిద్దరిని దేవీయాజ్ఞ చొప్పున చంపుతున్నానని ఆదొంగలనిద్దరినీ సంహరించాడు.

రాముడు భయపడుతున్న ఆ కన్య వద్దకు వచ్చి ఆమె గురించి అడిగాడు. ఆమె తన గురించి ఇట్లా చెప్పింది. "ఆర్యా! నేను కుంతల దేశాధిపతి శతకీర్తి కుమార్తె కనకప్రభను. నాతండ్రి నా వివాహనిమిత్తమై స్వయంవరాన్ని ప్రకటిస్తే దొంగమాటుగా వచ్చిన ఈ దొంగలు నన్ను అపహరించుకొని దేవికి బలియివ్వటానికి యిక్కడకు తెచ్చారు.

(ఇంకా వుంది)

# ప్రభాస తీర్థం – పౌరాణిక గాథలో సామాజిక ప్రతిబింబం



పాలకుర్తి రామమూర్తి

భారతీయ పౌరాణిక గాథలను దేవతల కథలుగా కాకుండా సామాజిక కోణంలో చూస్తే మానవ సంబంధాలకు ప్రతిబింబాలుగా కొన్ని విలువలు, సందేశాలు స్పష్టంగా కనిపిస్తాయి. దక్షుడు తన కుమార్తెలను ఇరువది యేడు మందిని చంద్రునకు ఇచ్చి వివాహం చేస్తాడు. వారిలో రోహిణి చాలా అందగత్తె కావడంతో, చంద్రుడు ఆమెపై అనురక్తుడై మిగిలిన భార్యలను అనాదరించాడు. దానితో వ్యథ చెందిన ఆ స్త్రీలంతా వెళ్ళి తండ్రికా విషయాన్ని చెప్పుకొని బాధపడతారు. దక్షుడు వారి నోదార్చి చంద్రునితో "నీవు భార్యలందరి పట్ల సమవర్తనను కలిగి, అందరిని సమంగా ఆదరించడం ధర్మం.. అలాకాని నాడు నిన్ను శపిస్తాను" అంటూ హెచ్చరిస్తాడు. అయినా చంద్రుని ప్రవర్తనలో మార్పురాని కారణంగా దక్షుడు, ఇకపై "అనునిత్యం నీవు క్షీణిస్తూ ఉండమని" చంద్రుని శపిస్తాడు.

చంద్రుడు ఔషధాలకు అధిపతి కావడంతో అతని క్షీణత దేవతలతో సహా ప్రపంచ జీవాళిపై ప్రభావాన్ని చూపుతుంది. దానితో దేవతలంతా దక్షుని వద్దకు వెళ్ళి మొరపెట్టుకోగా, ప్రసన్నుడైన దక్షుడు, చంద్రుని శాపాన్ని పూర్తిగా ఉపసంహరించకుండా.. నీ భార్యలందరి పట్ల సమదృష్టిని కలిగి చరిస్తే "పదునైదు రోజులు క్షీణత్వాన్ని, పదునైదు రోజులు వృద్ధిని పొందుతావని" శాపానికి వెసలుబాటు నిస్తాడు. అలాగే ప్రతి అమావాస్యనాడు "సరస్వతీ నదీ సంగమ" తీర్థంలో స్నానం చేయమని ఆదేశిస్తాడు. చంద్రుడు అలాగే తీర్థస్నానం ఆచరించి కాంతివంతమైన శరీరంతో ప్రకాశితుడౌట కారణంగా ఆనాటి నుండి ఆ తీర్థం "ప్రభాస తీర్థం"గా ప్రాచుర్యాన్ని పొందింది.



ప్రతీకాత్మకంగా చెప్పబడిన ఈ కథలో ప్రకృతిలో సహజమైన చంద్రుని వృద్ధిక్షయాలకు ఒక హేతువును సూచించారు. అలాగే సామాజిక నియమాలకు ప్రతిబింబంగా.. మానవ సంబంధాలలో ప్రేమ, న్యాయం, బాధ్యత, సమానత్వం, మరియు సమతుల్యత ఎంత ముఖ్యమో తెలియచేసారు. కుటుంబ వ్యవస్థలో కుటుంబ పెద్దలు, నాయకులు, వ్యక్తులు పక్షపాత వైఖరితో తమ బాధ్యతలను సరిగా నిర్వహించని నాడు సమాజంలో సమతుల్యత లోపించి, మానవ సంబంధాలను దెబ్బతీస్తుందనే సత్యాన్నీ ఈ

కథ చెపుతుంది.

తమకు జరిగిన అన్యాయాన్ని మౌనంగా భరించకుండా చంద్రుని భార్యలు తమ తండ్రి వద్దకు తీసుకువెళ్ళి పరిష్కారాన్ని కోరడం అన్యాయంపై సామూహిక ప్రతిస్పందనగా చూడవచ్చు. అలాగే ఇది సమాజంలో ఐకమత్యం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. దక్షుడు తండ్రిగా స్పందించడం, బాధ్యత నెరిగిన కుటుంబ పెద్దగా సలహా నివ్వడం, చంద్రుని తీరు మారకపోవడం చేత నాయకుడిగా శిక్ష విధించడం, అన్యాయాన్ని నిరసించే విధానానికి దర్పణంగా నిలుస్తుంది. ఇది సామాజిక నియమ నిబంధనలను పాటించేందుకు నాయకత్వం ఎంత అవసరమో తెలియచేస్తుంది. చంద్రునిలో బాధ్యతారాహిత్యం కనిపిస్తుంది. నాయకుడు దానిని ఎత్తిచూపినా తన ప్రవర్తన మార్చుకోకపోవడంతో శాపం అనివార్యమయింది. అంటే, బాధ్యతారాహిత్యం ఎప్పటికైనా ఫలితాన్ని అనుభవిస్తుంది. అయితే అది అనూహ్య పరిణామాలకు దారితీసింది. దక్షుని శాప ప్రభావం చంద్రుడిపైనే కాకుండా అతని భార్యలపై (తన కుమార్తెలపై) కూడా పడింది. అనగా, ఒకరి తప్పుకు మరికొందరు బాధపడాల్సి వచ్చింది. ఇది న్యాయపరంగా చూసినా, నైతికంగా చూసినా సమస్యాత్మకమే. ఇది క్యాచ్ 22 అనే ఆంగ్ల సామెతకు అద్దంపడుతుంది. సమస్యకు ఎలాంటి పరిష్కారాన్ని సూచించినా అది మరొక సమ్యసను సృష్టిస్తుంది. ఒక సమస్యను పరిష్కరించడం మరొక పెద్ద సమస్యను సృష్టించ కూడదు. దక్షుడు కుమార్తెల సమస్యను తీర్చే ప్రయత్నంలో చంద్రుని శపించడం ద్వారా చంద్రునికి క్షీణత్వమనే మరొక సమస్యను కుమార్తెలకు సృష్టించాడు. ఉద్దేశ్యం మంచిదయితే సరిపోదు.. దానిపై చీకట్లు అలుముకోవద్దు.

సమతుల్యత పాటించని నిర్ణయాలు ఒకరివైతే (చంద్రునివి) అనుభవాలు మరొకరివి (అతని భార్యలవి). శాపంలో మార్పులు దక్షుడు తన తప్పును గ్రహించిన భావనను తెలియచేస్తూనే... మానవ జీవితంలో ఉత్థాన, పతనాలు సహజమనే భావనను తెలుపుతున్నాయి. తప్పు చేసిన వ్యక్తిని శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలంటే, సరైన వ్యక్తిని శిక్షించడమే కాదు, దాని ప్రభావం ఇతరులపై పడకుండా చూడకుంటే.. న్యాయం పేరుతోనే అన్యాయం జరిగే ప్రమాదం ఉంటుంది.

ఇక్కడ స్త్రీల వ్యక్తిగత అభిప్రాయం లేదా స్వేచ్ఛ పరిగణనలోకి తీసుకొనకుండా, దక్షుడు తన కుమార్తెల నిరువది యేడు మందినీ ఒకే వ్యక్తికిచ్చి వివాహం చేయడం పితృస్వామ్య వ్యవస్థకు దర్పణంగా చూడవచ్చు. రోహిణిపై ప్రేమను చూపి మిగతావారిని అనాదరించే చంద్రుని ప్రవర్తన పురుషాధిక్యతకు, బాధ్యతా రాహిత్యానికి ప్రతీకగా కనిపిస్తుంది. చంద్రుని భార్యలు సమష్టిగా తండ్రిని కలిసి వారికి జరిగిన అన్యాయాన్ని చెప్పడం సామూహిక చైతన్యంగా భావించవచ్చు. ఎవరికి వారే వ్యక్తిగతంగా కాకుండా సమూహంగా స్పందించడం వల్లనే వారి సమస్యకు ప్రాముఖ్యత వచ్చింది. ఇది సమాజంలో అన్యాయానికి వ్యతిరేకంగా ఐక్యత ఎంత అవసరమో తెలియచేస్తుంది.

దక్షుడు శాపం విధించడాన్ని సామాజిక నియమాలు పాటించని వారిపై శిక్షలు విధించడం ద్వారా వ్యవస్థను కాపాడ వలసిన అవసరం నాయకునికి ఉంటుందని భావించినా, దాని పరిణామాలు పట్టించుకోకుండా, భావోద్వేగాలకు ప్రాధాన్యత నీయడం వల్ల తన కుమార్తెలకే అన్యాయం జరిగింది. నిజానికి విధించిన శిక్ష సమస్యను పరిష్కరించిందా? శాపానికి ఇచ్చిన వెసలుబాటు.. పదిహేను రోజులు క్షీణత, పదిహేను రోజులు వృద్ధి.. ఇది సమస్యకు పూర్తి న్యాయం చేయకపోయినా, వ్యవస్థ కొనసాగేందుకు మధ్యేమార్గాన్ని సూచించింది. వాస్తవ జీవితంలో దీని అవసరం ఉంటుంది.

ఈ కథను లోతుగా పరిశీలిస్తే... పక్షపాతం, అతిమోహం, భావోద్వేగాల నియంత్రణ లేమి, తప్పుడు నిర్ణయాలు వాటి పరిణామాలను సమాజానికి తెలియచేస్తూ, మార్గదర్శన చేసిన విధం కనిపిస్తుంది.

పాలకుర్తి రామమూర్తి

# తూర్పు గోదావరి జిల్లా__ చారిత్రిక నేపధ్యం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

(తరువాయి భాగం-2)

బౌద్ధ యుగం తరువాత జైన యుగం ప్రభావం తూర్పుగోదావరి జిల్లామీద తక్కు-వగానే ఉంది. క్రీ.శ. 4,5, శతాబ్దాల కాలంలో ఈ జిల్లా కొంత భాగం శాలంకాయనుల పరిపాలనలోను ,కొంత భాగం మాఠర రాజుల పరిపాలనలోను ఉంది. 5వ శ. చివరి భాగంలో విష్ణు కుండినుల ఆధిపత్యంలో-కి వచ్చింది. క్రీ.శ.455 ప్రాంతంలో పల్లవ రాజైన మూడవ నరసింహ వర్మ కళింగ రాజ్యాన్ని జయించాడు. అప్పుడు తూర్పు గోదావరి జిల్లా పల్లవ రాజుల అధీనంలో ఉంది.

తరువాత కళింగ రాజ్యానికి వాసిష్ఠీ వంశీయులు అధికారంలోకి వచ్చారు. వారు పిఠాపురాన్ని రాజధానిగా చేసికొని రాజ్యాన్ని పాలించారు. ఇక్కడ విష్ణు కుండినులు సామంతులుగాఉండి రాజ్య పాలన చేసారు. తరువాత వీరు స్వతంత్రత ప్రకటించుకొని పిఠాపురాన్ని రాజధానిగా చేసుకొని రాజ్యా-న్ని పాలించారు.

5,వ.శ. చివరి భాగంలో కళింగ సామ్రాజ్యం గాంగ వంశం వారి అధీనంలోకి వచ్చింది. వారు విష్ణు కుండినులతో యుద్ధం చేసారు . ఆ సమయంలో తూర్పు గోదావరి జిల్లా చేతులు మారుతూ వచ్చింది. విష్ణుకుండినుల కాలంలో కాకినాడ, రాజోలు, రామచంద్రాపుర ప్రాంతాన్ని గుద్రహార విషయ అని పిలిచే వారు.

7.వ శ. ప్రారంభలో బాదామి చాళుక్యుల రాజయిన రెండవ పులకేశి కళింగ సామ్రాజ్యాన్ని , పిఠాపురాన్ని జయించాడు. ఈ ప్రాంతానికి పృధ్వీ ధ్రువరాజ, ఇంద్ర వర్మ అను వారిని తన ప్రతినిధులగా నియమించాడు. వీరు స్వతంత్రత ప్రకటించడంతో రెండవ పులకేశి తన తమ్ము-డైన కుబ్జ విష్ణు వర్ధనుని ఆంధ్ర ప్రాంతానికి రాజుగానియమించాడు.

ఇతడు పృధ్వీ ధ్రువరాజును జయించి పిఠాపురాన్ని రాజధానిగా చేసుకొని తూర్పుగోదావరి జిల్లా అంతా అంతా పరిపాలించాడు.

10వ. శ . తూర్పు గోదావరిజిల్లా తూర్పు చాళుక్యుల అధీనంలోకి వచ్చింది. " ఈ సమయంలో " చాళుక్య భీమరాజు " ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు.

ఇతని పేరుతో చాళుక్య భీమవరం అనే రాజ్యాన్ని నిర్మించాడు. ఆ భీమవరాన్నే నేడు సామర్ల కోట అని పి-లుస్తున్నారు. " కోట" అని పేరు చివర ఉంటే అది ఒకప్పటి రాజ నివాస ప్రాంతం అని గ్రహించాలి. చాళుక్య కోట తరువాత కాలంలో సామర్ల కోట అని అయిందా? . ఇక్కడ మరొక ఐతిహ్యం ఉంది. ఈ గ్రామానికి గ్రా-మదేవత శ్యామలా దేవి. ఆమె పేరుతో శ్యామల కోట అని ఆ గ్రామాన్ని పిలిచే వారు. ఆ పేరు కాలక్రమంలో శ్యామల> సామర్ల అయి, కోట శబ్దం అలాగే ఉండి సామర్ల కోట అయిందని కొందరి అభిప్రాయం.

ఈ చాళుక్య భీమేశ్వరుడు తూర్పుగోదావరి జిల్లాలో రెండు దేవాలయాలు నిర్మిం-చాడు. !. సామర్ల కోటలోని భీమేశ్వర ఆలయం 2. ద్రాక్షారామంలోని భీమేశ్వర ఆలయం. ఇక్కడ లభించిన శాసనాలు , శిల్ప కళా వైభవం ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి.



ద్రాక్షారామ దేవాలయం గురించి కొన్ని పురాణాల ఆధారాలు ఉన్నాయి . దక్షుడు ఇక్కడ యజ్ఞం చేసాడని,(దక్ష యజ్ఞ వృత్తాంతం అందరికీ తెలిసినదే ) ఆ సమయం సప్తర్షులు అక్కడికి వచ్చి , గోదావరిలోని ఏడు పాయలని తీసుకు వచ్చారని చెబుతారు. దేవాలయానికి ఎదురుగా ఉన్న కుండాన్ని సప్త సాగర కుండం అని పిలుస్తారు.

క్రీ. శ . 1వ శతాబ్దంలో హాలుడు అనే రాజు ఆంధ దేశాన్ని పాలించాడు . అతడు లీలావతి అనే సింహళ రాజు కుమ్మార్తెను వివాహంచేసుకున్నాడు . వారి వివాహం ద్రాక్షారామం దేవాలయంలో జరిగింది . ఈ విషయం లీలావతి అనే ప్రాకృత గ్రంథంలో ఉంది. అప్పుడు ఈ ద్రాక్షారామాన్ని దాకరేమి అని పిలిచేవారు.

ఈ సమయంలోనే పిఠాపురంలోని పాదగయగూర్చి తెలుసుకోవాలి. పిఠాపురంలో కుక్కుటేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఉన్న కుక్కుటేశ్వరునికి ఎదురుగా పాద గయా కోనేరు ఉంది. ఈ కోనేరుగురించి ఒక పౌరాణిక గాథ ఉంది. శివుడు గయాసురుని సంహరించగా, అతని పాదాలు ఈ కొలనులో పడ్డాయి. అందువలన ఈ క్షేత్రాన్ని పాదగయ అని పిలుస్తున్నారు.

క్రీ.శ. 918-925 కాలంలో మెదటి అమ్మరాజ విష్ణు వర్ధనుడు రాజ్యాన్ని పాలించాడు. ఇతని కాలంలో రాష్ట్ర కూటులు, చాళుక్యులనుండి యుద్ధాలు వస్తూ ఉండేవి .అప్పటికి వేంగి గ్రామం రాజధానిగా ఉండేది. ఈ గ్రామాలు నేటికి పెద వేగి, చిన వేగి అనే గ్రామాలు పశ్చిమ గోదావరిలో ఉన్నాయి. ఈ ప్రాంతం సమతలంగా ఉండడం వలన శత్రుభయం ఎక్కువగా ఉండేది. అందువలన తన రాజధానిని గోదావరి తీరానికి మార్చాడు. ఒకవైపు నది, మరొకవైపు అగర్త.
ఈ అగర్తే నేటి గోదావరి స్టేషన్ నుండి రాజమండ్రి స్టేషన్ కి వెళ్ళే మార్గం. ఆ అగడ్త బొమ్మూరు దగ్గర గోదావరిలో కలిసేది. సహజంగా ఏర్పడిన రక్షణతో అమ్మరాజు రాజ్యపరిపాలన ప్రశాంతంగా సాగుతోంది. అమ్మరాజుకి " రాజ రాజ నరేంద్రుడు " అని బిరుదు ఉండేది. ఈ బిరుదు పేరుతోనే ఈ గ్రామానికి రాజమహేంద వరం అను పేరు స్థిరపడింది.

ఇక్కడ మరొక చారిత్రిక సత్యం ఉంది. అమ్మరాజు తరువాత వంద సంవత్సరాలకి రాజరాజనరేంద్రుడు రాజ్యానికి వచ్చాడు . ఇతని తల్లి చోళ రాజుల కూతురు . అందువలన ఇతని కాలంలో చాళుక్య, చోళుల సంబంధాలు ఏర్పడ్డాయి.

ఇతని కాలంలోనే సంస్కృత భారతాన్ని నన్నయ తెలుగులోకి అనువదించాడు. నన్నయ భారత రచన తరువాత తెలుగు భాషపై సంస్కృత ప్రభావం ఎక్కువయిందని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. నన్నయభటుకు , అతనికి సహాయంచేసిన నారాయణ భట్టుకి నందంపూడి అనే అగ్రహారాన్ని రాజ రాజ నరేంద్రుడు దానంగా ఇచ్చాడు. పావులూరి మల్లన గణిత శాస్త్రాన్ని రచించాడు. ఇతనికి పిఠాపురానికి దగ్గరగా ఉన్న నవఖండ వాడ గ్రామాన్ని దానంగా ఇచ్చాడు.

రాజ రాజ నరేంద్రుని తరువాత అతని కుమారుడు రాజేంద్ర చోళుడు రాజ్యాన్ని పరిపాలించాడు.ఇతడు కాంచీపురం, వేంగీ రాజ్యాలకు రాజయ్యాడు. తూర్పు గోదావరి జిల్లాలో చాళుక్య , చోళ యువరాజులు ప్రతినిధులుగా ఉండే వారు. వారి రాజధాని ద్రాక్షా రామం.

(ఇంకా వుంది)

## కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు

ముడుంబై వేంకటాచార్యులు

ఇది జ్ఞానార్జనా విధానం. తదుపరి.. శమము, దమము మొదలైన విద్యలను ఆచరిస్తూ.. జితేంద్రియుడై.. ఏ విధమైన ప్రలోభాలకు లొంగక.. ఒక సమర్థుడైన గురువును ఆశయించి బ్రహ్మతత్త్వాన్ని సమగ్రంగా తెలుసుకోవాలి. అలా తెలుసుకున్న తత్త్వ రహస్యాలను త్రికరణ శుద్ధిగా అంటే మనసా, వాచా, కర్మణా ఆచరణలో పెట్టి, స్వోచిత ("స్వ ఉచిత" తనకు ఉచితమైన) కర్మలను అనుష్ఠిస్తూ, భగవత్ సంకీర్తనలో నిరంతర ధ్యానమగ్నుడు కావాలి. అలాంటివాడు పరబ్రహ్మమును పొందుతాడని చెపుతాడు, జనకుడు. ఇక్కడ చెప్పబడిన "భగవదుపాసన" అనే పదాన్ని గుర్తించాలి. భగవంతుడు అంటే దేవుడు కాడు. దేవుడు అనేది పరిమితమైనది. భావన చేయగలిగిన పరిమితులలో నిలిచిపోయేది. అంతేకాదు.. అది మూర్తిని ఆశ్రయించి వ్యక్తమయ్యేది కాబట్టి అనంతం కాదు.. ఇక భగవంతుడు అనేది అపరిమితము, అవ్యక్తమూ, అనంతమూ కూడా. ఇక ఉపాసన అనేది పూజ, జపము, ఆరాధన లాంటి బాహ్యప్రక్రియలకు అతీతమైనది. నిరంతరం భౌతికంగా ఏ పని చేస్తున్నా ధ్యానం మాత్రం భగవంతునిపై నిలుపుతూ.. అన్ని కర్మల ఫలితాన్నీ భగవదర్పితంగా, కర్తవ్యాలుగా నిర్వహించడం ఉపాసన. ఇలా అన్ని రహస్యాలను బోధించి చివరగా.. "అహం త్వా మనుపశ్యామి యే చాన్యే మనీషిణః".. ఓ శుక యోగీంద్రా! అట్టి యోగ్యతలు పరిపూర్ణముగా నీ యందు ఉన్నవి అంటూ ఆశీర్వదించి పంపిస్తాడు.

తిరిగి మేరుపర్వతం వద్ద నున్న తండ్రి వద్దకు వచ్చిన శుకుడు ఒకనాడు.. తండ్రితో గూడి వేద విద్యను పారాయణం చేస్తుంటాడు. ఆ సమయంలో ధ్యాన నిష్ఠతో వేదాన్ని ఉచ్చరించే శుకుని కంఠ స్వరం నుండి ఒక గొప్పనైన వాయువు వెలువడి ఆ పర్వతాన్ని "అతలాకుతలం" చేస్తుంది. కుతలం అంటే భూమి. ఈ భూమి క్రింద ఆరు లోకాలు ఉన్నవి. వాటిని "అతల, వితల, సుతల, తలాతల, రసాతల, పాతాల లోకాలు" అంటారు. అతల లోకం నుండి కుతలం దాకా అంటే తలక్రిందులవడంగా చెప్పుకోవాలి. దానినే సాధారణ భాషలో చెప్పుకుంటే అయోమయం కావడం.. లేదా తలక్రిందులవడంగా భావించాలి.

దానిని గమనించిన వ్యాసుడు.. ఒక ప్రళయం విధంగా వెలువడిన ఆ వాయువును కూడా గమనించకుండా వేదాధ్యయనం చేస్తున్న శుకుని ఆపేయమని ఆదేశిస్తాడు. తండ్రి ఆజ్ఞతో ఆ సమాధిస్థితి నుండి బయటకు వచ్చిన శుకుడు కూడా ప్రకృతిలో జరుగుతున్న మార్పులు గమనించి కారణం అడుగుతాడు. దానికి వ్యాసులవారు.. శుకుని వేదోచ్ఛారణతో అనంతమైన శబ్దతరంగాలు వాయురూపంలో వెలువడ్డాయని.. అవి ఏడు వాయువులుగా వాటి స్వభావాన్ని బట్టి ఉంటాయని అప్పుడు వెలువడిన వాయువు పేరు "పరావహము" అని చెపుతూ.. అది మహావిష్ణువు నిశ్వాస రూపమైనదని చెపుతాడు. మిగిలిన ఆరు వాయువులను పేర్కొంటూ.. "ప్రవహమూ, ఆహవహమూ, ఉద్వహము, సంవహము, వివహమూ, పరివహములు" అంటాడు. అలా చెపుతూ నీ యోగసాధన పరాకాష్ఠకు చేరుకున్నదని చెపుతాడు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి.. ఈ ఎనిమిదింటిని పతంజలి మహర్షి అష్టాంగయోగాలుగా చెప్పాడు. వీటిని సాధించాడు.. కాబట్టే యోగసాధనలో పరాకాష్ఠకు చేరుకున్నాడు, శుకుడు.

సాధారణంగా "మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపురము, అనాహతము, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రారం" ఈ ఏడు చక్రాలను చెపుతారు..

(ఇంకా వుంది)

# శ్రీ ఆంజనేయం

## నూతన ధారావాహిక




డా॥కె.రామానందం

రుద్రాంశ సంభూతుడు పరమ వైష్ణవ శిఖామణి ఆంజనేయుడు. కోరిన వారికి కోరిన రూపాన దర్శనమిస్తాడు. తలచినవారికి తలపులలోని అభీష్టాలను సిద్ధింపజేస్తాడు. ఆర్తితో పిలిచిన వారికి ఆపన్నహస్తం అందించే సులభ సాధ్యుడైన దైవం ఆంజనేయస్వామి. భక్తుడు భగవంతుడు ఒకటయ్యే మార్గానికి వారధి హనుమ. కార్యదీక్షకు, సాధక లక్షణాలకు ప్రతీక పవమాన సుతుడు. రాముడెంత ఘనుడో, రామభక్తుడైన హనుమ అంతే ఘనుడని భక్తుల విశ్వాసం.

శ్రీ ఆంజనేయుని ఆలయంలేని గ్రామం మన దేశంలోనే లేదు. ఎందుకంటే హనుమంతుడు కేవలం దేవతామ ర్తి మాత్రమే కాదు. ఆయన శ్రీరామభక్తుడు. రాజకీయకోవిధుడు, యోగసిద్ధుడు, వ్యాకరణవేత్త, యుద్ధవిశారదుడు, మ ర్తిభవించిన ధర్మమ ర్తి పలికినంత మాత్రమున పసివారి నుంచి పండు ముసలి వారి హృదయాలు సైతం ఉత్తేజపూరితమవుతాయి.

దుష్ట శిక్షణ, శిక్ష రక్షణ చేయటానికి సాక్షాత్తు పరమశివుడే రామకార్యాన్ని సిద్ధింప చేసే సంకల్పంతో హనుమంతుడిగా అవతరించాడని ఒక భావన. వానర రూపాన్ని ధరించిన ఏకా< శరుద్రులలో ఒకరు ` శ్రీ ఆంజనేయస్వామి. సకల సద్గుణాల ప్రతిరూపమైన ఆంజనేయుని ఎవరు సేవిస్తారో వారికి అపజయం అంటూ ఉండదు.



జ్ఞానంలో ఉచ్ఛస్థితి, బలంలో ఉచ్ఛస్థితి, వీరత్వంలో ఉచ్ఛస్థితి, కీర్తిలో ఉచ్ఛస్థితి, సేవలో ఉచ్ఛస్థితి, వినయంలో ఉచ్ఛస్థితి అంటూ సకల సద్గుణ స్వరూపం హనుమంతుడు. ఆయన వైశాఖమాసం కృష్ణపక్ష దశమితిథి శనివారంనాడు పూర్వాభాద్ర నక్షత్రం ప్రథమపాదంలో కౌండిన్యస గోత్రజ్ఞుడై కేసరి, అంజనాదేవి దంపతులకు వాయుదేవుని అనుగ్రహం ద్వారా జన్మించాడు. ఈయనకు మారుతి, ఆంజనేయుడని పేర్లు ఉన్నవి. వర ప్రభావం వలన జన్మతః హనుమంతుడు దివ్య తేజోవిరాజితుడు. బాల్యంలోనే ఇతడు రక్తవర్ణంతో ప్రకాశిస్తున్న సూర్యబింబాన్ని చూచి దానినొక పండిన పండుగా భ్రమించి మ్రింగ జూచినాడు. వాయు వేగంతో రివ్వుమని అంతరిక్షానికి ఎగిరి వెళ్ళాడు. అడ్డుపడిన రాహువును సైతం కబలింపదలిచాడు. అదరక బెదరక ఇంద్రుని ఐరావతం మీదకి ఉరికాడు. ఆగ్రహించిన దేవేంద్రుడు తన వజ్రాయుధంతో అతడిని క్రింద పడి మ ర్ఛపోవునట్టుగా కొట్టాడు. అతడి హనువులపై పెద్ద దెబ్బ తగిలినప్పటికీ అవి చెక్కు చెదరలేదు. కనుకనే ఇతడు హనుమంతుడు.

భగవానుడైన సూర్యుడినే ఉపాశించి సకల విద్యలను అవిరామంగా నేర్చుకున్నాడు. ఒక పాదం ఉదయాద్రిపై మరో పాదం అస్తాద్రిపై ఉంచి సూర్యునికి ఎదురుగా నడుచుచూ విద్య నేర్చుకున్నాడు. హనుమంతుని పూజించిన చోట, ఐశ్వర్యం సుస్థిరంగా ఉంటుంది. దీర్ఘాయురారోగ్యాలు సర్వత్రా విజయాలు లభించడమే కాక, ఎటువంటి భూత సంక్షోభాలు దరి చేరవని

సుదర్శన సంహిత వాక్కు.

సీతాన్వేషణ సమయంలో రామలక్ష్మణులు కిష్కింధకు ఏతెంచారు. సుగ్రీవుడు ఆనతి మేరకు హనుమంతుడు భిక్షుక రూపధారియై రామలక్ష్మణులను కలిసి వారి వృత్తాంతములు తెలుసుకొని, తన నిజరూపాన్ని ధరించి హనుమ రామ సుగ్రీవులను ఏకం చేసి, సీతాన్వేషణలోని క్లిష్టతను దూరం చేశాడు. వాలి-సుగ్రీవులు మధ్య ఉన్న వైరాన్ని రామునికి తెలియజేసి సుగ్రీవునితో చేతులు కలిపేలా చేశాడు. ఫలితంగా సుగ్రీవునకు రాజ్యం దక్కే మార్గం సుగమమైంది. రామలక్ష్మణులకు సీతాన్వేషణ కార్యం సుగమమైంది. చక్కని ప్రణాళికతో హనుమ ముందుండి కార్యసాధన మార్గాన్ని సుగమం చేసి తన కార్య నిర్వాహక చతురత తెలుపుకొన్నాడు.

లంకాధిపతి రావణుడు సీతను చెఽ పెట్టి తన పురానికి తోడ్కొని పోయినట్లు సంపాతి అనే పక్షి రాజు ద్వారా తెలుసుకొని హనుమంతుడు సముద్ర లంఘనం చేయ సంకల్పించాడు. సకలదేవతలను ప్రార్థించి రామ కార్యోత్సాహియై ఆకాశము నంటునట్లు తన దేహాన్ని పెంచి, అచ్చట పర్వత శిఖరంపై పాదాల నుంచి ఊపిరి బిగబెట్టి సముద్ర లంఘనం చేయసాగాడు. మార్గమధ్యంలో నాగమాత సురసను, సింహిక, లంకిణిలను చాకచక్యంగా ఓడించి లంకలో ప్రవేశించాడు. రాక్షస జన పరివేష్టితమై, శోకమ ర్తియై అశోక వనమునందున్న సీతమ్మను చూసి, సమయానుకూలంగా తనను పరిచయం చేసుకుని, శ్రీరామును బంటునని తెలిపి, ఆమెకు ఆనవాలుగా రాముని ఉంగరాన్ని అందజేశాడు. ఆమెకు తన భుజములపై అధిరోహింప జేసి శ్రీరాముని చెంతకు తీసుకుపోవుటకు అనుమతి కోరాడు. కానీ సీత తన భర్త వీర పరాక్రమాలను ప్రదర్శించి, రావణుని సంహరించి తనను తీసుకు వెళ్లడం రామునికి గౌరవమని చెప్పి హనుమ కోరికను సున్నితంగా నిరాకరించింది. ఆమెను చేరిన హనుమ చక్కనైన సమయస్ఫూర్తిని వాక్చాతుర్యాన్ని ప్రదర్శించి ఆమె నమ్మకాన్ని చూరగొన్న కార్యనిర్వాహకుడు.

హనుమంతుడు తలపెట్టిన కార్యం సరైన పద్ధతిలో జరగడానికి రావణుని వనాలను పాడు చేశాడు. శత్రువు యొక్క భటులని సంహరించాడు. జంబుమాలిని, అక్షయ కుమారులను హతమార్చాడు. చివరకు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును గౌరవించి బందీకృతుడైనాడు. రాముని శక్తి సామర్థ్యాలను రావణ సభలో ప్రకటించాడు. రాముడి శరణుగోరమని హితవు పలికాడు. రావణుడతని హితవచనాలకు ఆగ్రహించి హనుమ వాలమునకు వస్త్రాలను చుట్టి నిప్పు అంటించమని భటులను ఆజ్ఞాపించాడు. భటులు అలా చేయగా హనుమంతుడు గంతులు వేస్తూ, సీతయున్న అశోకవనం, విభీషణుని గృహము తప్ప లంకానగరమంతయ కాల్చి వేశాడు. విభీషణుని లంకను వీడి రాముని పక్షాన్ని జే రేలా చేయగలిగాడు. హనుమ పాత్ర నేర్పే మరో పాఠం ` అన్నివేళలా శక్తి పనికిరాదు. అవసరమైతే ఒదిగి ఉండాలని మండుతున్న అగ్నిని నీళ్లతో చల్లార్చినట్లు ఊబికిన కోపాన్ని చల్లార్చుకునేవారే మహాత్ములు. వారే ధన్యులు. వారే ఉత్తమ పురుషులు. కనుక కోపం తగదని హనుమంతుని ప్రబోధము.

సకల దేవతలలో శ్రీరాముడు ఎంత శ్రేష్ఠుడో రామాయణంలో సుందరకాండ అంత ఉత్తమం. అందుకే సుందరాకాండ పారాయణం సకలార్థ ప్రదాయిని. సాధకుడు సకల అభీష్టాలను ఐహిక విషయాలకే కాకుండా పారమార్థిక విషయాలకు కూడా సుందరాకాండ పారాయణం ఉపకరిస్తుంది. పారాయణం చేయడం వల్ల ఉద్యోగ ప్రాప్తి, ధనలాభం చేకూరుతాయి. ఆయురారోగ్య విద్యాధనాధులన్నీ పొందుతారు.

శ్రీరాముడు వారధికి సేతువు కట్టి, లంకలో ప్రవేశించుటకు తోడ్పడిన వాడు హనుమంతుడు. ఆంజనేయుని శ్రీరామ హృదయానందమని అన్నారు. రామ భక్తుడైన హనుమంతుడు స్వామి సంతోషం కోసం ముందు వరసలో ఉంటాడు. సంజీవిని తెచ్చి మ ర్ఛితుడైన లక్ష్మణునికి ప్రాణదానం చేశాడు. సీత జాడను కనిపెట్టి లక్ష్మణుని బతికించి శ్రీ-

రాముని ఆనందానికి కారణమయ్యాడు. భగవాన్ శ్రీరామచంద్రుడు స్వయంగా హనుమంతుని ప్రేమగా కౌగిలించుకొని అతని సేవలను కొనియాడాడు.



అయోధ్యానగరంలో ఒకసారి సీతాదేవి పాపిటలో సింధూరం ధరించడాన్ని ఆంజనేయస్వామి గమనించాడు. అందుకు కారణము ఏమిటని తెలుసుకున్నాడు. సీత అలా అలంకరించుకుంటే రామయ్య ఆయుష్షు పెరుగుతుందని గ్రహించాడు. వెంటనే హనుమంతుడు సింధూరంలో పొర్లాడాడు. పొడిపొడిగా ఉన్న సింధూరం ఒంటికి అంటుకోక రాలిపోవడం మొదలు పెట్టింది. ఈసారి నూనె తొట్టిలో మునిగి వెళ్ళి పిదప సింధూరం అంటించుకున్నాడు. ఆయన ముగ్ధ భక్తికి మెచ్చిన శ్రీరాముడు మంగళవారం నాడు ఎవరైతే హనుమంతునికి సింధూర సేవ చేస్తారో వారికి నేను అనుగ్రహిస్తానని హామీ ఇచ్చాడు. కాశీక్షేత్ర నివాసి అయినా తులసీదాసు ఆ శ్రీరామ అనుగ్రహాన్ని ఆంజనేయుని అనుగ్రహాన్ని పొందాడు. ప్రజలంతా తులసీదాసును దర్శిస్తే మేలు జరుగుతుందని భావించేవారు. తులసీదాసు గురించి ఆనాటి పాలకుడు అక్బరు తెలుసుకుని ఆయనను తన దర్బార్‌కు పిలిపించాడు. మహిమలు కొన్నింటిని చూపించమన్నాడు. రామచంద్రుని కృప తప్ప ఏమీ లేదని సవినయంగా తులసీదాసు విన్నవించుకున్నాడు. అందుకు అక్బర్ ఆగ్రహించి కొరడాలతో కొట్టమని ఆజ్ఞాపించాడు. అయితే భటుల కొరడాలు లేచినవి లేచునట్లుగా ఉండిపోయాయి. అసంఖ్యాకమైన కోతులు దర్బార్‌లోకి వచ్చి బెదిరింపుసాగాయి. అప్పుడు అక్బర్ విధిలేక తులసీదాసును క్షమించమన్నాడు. తులసీదాసు తన భక్తి ప్రపత్తులతో ఆంజనేయస్వామిని ప్రార్థించాడు. అదే హనుమాన్ చాలీసా అయ్యింది. హనుమాన్ చాలీసా బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం నిర్భయత్వం, ఆరోగ్యత, అజాఢ్యం, వాక్పటుత్వం అన్నీ హనుమంతుని స్మరణవల్ల జరుగుతాయని చెప్పే సంస్కృత శ్లోకాన్ని పోలిన దోహా చాలీసాలో తొలి దోహాగా కనిపిస్తుంది.

బుద్ధిహీన తను జానకై సుమిరౌ పవనకుమార్
బలబుద్ధి విద్యాదేహు మోహి హరహు కలేశ వికార్

శ్రీరాముడు దశకంఠ రావణుని సంహరించాడు. సముద్ర మధ్యలో ప్రతాపలంకను పాలించే శతకంఠుని సీతమ్మ సంహరించింది. ఆ యుద్ధంలో సీతమ్మకు హనుమంతుడు సహకరించాడు. యుద్ధంలో శతకంఠుని అస్త్రధాటికి రామలక్ష్మణులు మ ర్ఛపోయారు. అశరీరవాణి సీతాదేవికి పంచముఖమన్మహావిద్య ఉపదేశిస్తుంది. అంతేకాక సీతాదేవికి అవతార పరమార్ధం గుర్తుకొస్తుంది. రాక్షస సంహారిణి అయిన మహాకాళీ స్వరూపంతో పంచముఖ హనుమును అధిష్టించి శతకంఠునితో పోరాటం చేయమని చెప్పింది. వెంటనే సీతాదేవి పంచముఖ హనుమాన్ మహా మంత్రాన్ని ఉపాసిస్తుంది. ఫలితంగా పంచముఖాలతో అరిభయంకర రూపంతో హనుమ సాక్షాత్కరించారు. సీతమ్మ కూడా మహాకాళీ అవతారాన్ని ధరించి పంచముఖుని అధిరోహించి, జరిగిన ఘోర యుద్ధంలో చివరిగా రామపాద ధ్యానం చేసి అమ్మ విడిచిన బాణములతో శతకంఠుడు చనిపోయాడు. మ ర్ఛ నుండి తేరుకున్న రాముడికి యుద్ధరంగంలో విజృంభించిన

## మీడియా అక్రెడిటేషన్ కమిటీలో... టీడబ్ల్యూజేఎఫ్ కు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం పట్ల హైకోర్టు ఆగ్రహం -కోర్టు ధిక్కారణగా పరిగణించాల్సివస్తుందని వ్యాఖ్య

**మీడియా అక్రెడిటేషన్ కమిటీ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) యూనియన్ కు ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై ఆ సంఘం వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య హైకోర్టు దాఖలు చేసిన పిటిషన్ పై శుక్రవారం సింగిల్ బెంచి విచారణ జరిపింది. ఈ విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాదుల వాదనలు, పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న తర్వాత సింగిల్ బెంచి న్యాయమూర్తి జస్టీస్ రేణుక యారా తీవ్రంగా స్పందించి ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో పిటిషనర్ మామిడి సోమయ్య ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ కు దాఖలు చేసుకున్న దరఖాస్తును అమలు చేయకపోడం, ప్రభుత్వ న్యాయవాదులు కౌంటర్ ఫైల్ చేయకపోడం పట్ల న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి ౨౦న పిటిషనర్ సమర్పించిన రిప్రజెంటేషన్ పై ఎటువంటి చర్యలు తీసుకున్నారో, తీసుకున్న చర్యల పై ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ఎటువంటి నివేదిక సమర్పించారో తెలియజేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఈ వ్యాజ్యన్ని తదుపరి విచారణకు వాయిదా వేశారు. అదేవిధంగా మార్చి ౨౬న కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేసి నివేదిక(compliance report)ను కోర్టుకు సమర్పించాలని జస్టీస్ రేణుక యారా ప్రతివాదులను ఆదేశించడం జరిగింది.**

**కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వ న్యాయవాదులను వ్యాఖ్యానిస్తూ ఆదేశాలు జారీ చేయడం జరిగింది.**

---

తీరు సీతాదేవి వివరిస్తుంది. రాముడి హనుమపంచముఖ రూపాన్ని దర్శింపజేయమని కోరుతాడు. ఆ విధంగా పంచముఖ ఆంజనేయ అవతారం వెలుగులోకి వచ్చింది. పంచముఖ అవతారంలో హనుమ వానర, నారసింహ, గరుత్మంత, హయగ్రీవ, సూకల ముఖాలతో, పది చేతులు, పదిహేను నేత్రాలతో కానవస్తాడు. ఈ పంచముఖాంజనేయుని ఉపాసన చేసిన వారిలో ఋషీశ్వరులెందరో ఉన్నారు. ఇతరుల సంతోషానికై తన శక్తియుక్తులను ధారపోసిన ధన్యజీవి హనుమంతుడు. రామాయణ మహాయజ్ఞంలో రాముడు 'యాజి' కాగా హనుమంతుడు ఋత్విజుడయ్యాడు. హనుమంతుడు సుగ్రీవునికి మంత్రిగా, విభీషణునికి సలహాదారుగా, వానరసేనకు సేనానాయకునిగా, ఒక దౌత్యవేత్తగా, ఒక మహబలవంతునిగా, ఒక కార్యశీలి పాత్ర చేపట్టి సంజీవిని పర్వతాన్ని తోడ్కొని వచ్చిన వీరుడుగా, అహిరావణుని బంధాల నుండి రామలక్ష్మణులను విడిపించిన కార్యనిర్వహణ సమర్ధుడుగా, ఒక ఆర్థికవేత్తగా, ఆడినమాట తప్పక యయాతిని రక్షించినవాడుగా, వినయశీలి, మహాతపస్వి, స్థితప్రజ్ఞుడు, నిస్వార్థజీవిగా బహుముఖ పాత్రలు జయప్రదముగా నిర్వహించిన మన రామభక్తుడు వీరహనుమాన్. సకల సద్గుణాల ప్రతిరూపం. హనుమంతుడు మంగళవారానికి అధిపతి. మంగళుడు అంటే కుజుడు. కుజ గ్రహ అధిదేవతయైన హనుమంతుణ్ణి, తమలపాకులతో పూజించడం వల్ల కుజదోషాలు పరిహారమవుతాయి. ఆలయాల్లో స్వామివారికి అష్టోత్తరశతనామాలతో, సహస్రనామాలతో, లక్ష తమలపాకులతో హనుమకు అర్చన చేస్తారు. హనుమంతుని పూజలో కనీసం అయిదు తమలపాకులైనా ఉంచాలని అంటారు. జీవితంలో ప్రశాంతతకు సౌభాగ్యసిద్ధిని పొందడానికి హనుమకు ఆకుపూజ చేస్తారు. పూజానంతరం స్వామికి ఇష్టమైన అరటి పండ్లు, దానిమ్మ పళ్ళు, వడమాల నివేదించి, ఆయన కృపా వీక్షణాలకు లోనవుతారు. ఆంజనేయ పూజ ధైర్యసాహసాలకు, బలవృద్ధికి దోహదపడతాయి. సకలైశ్వర్య దాయకం. భక్తి ముక్తి ప్రదాయకం. - జై ఆంజనేయ

# నా తెలంగాణా తల్లి



ఏమని సెప్పుదు ఎంతని సెప్పుదు నా తెలుగు బాస తీయదనం
తొలి చూలు బిడ్డని పొత్తిళ్ళలో ఎత్తుకున్నపుడఉన్నంత మెత్తగా హత్తుకున్నట్టుంటది
ఉగ్గు పాలుపోస్తూ బుగ్గలు నిమురుతా తల్లిపాడే జోల పాట లెక్క జో కొట్టినట్టుంటది
సందమామని చూపిస్తూ బువ్వ తినిపించే మా అవ్వ సేతి నెయ్యి ముద్ద లెక్క ముద్దుగుంటది.
తోడి తోడని పెరుగులా వచ్చిరాని మాటలు అమ్మకి సెప్పే బుజ్జితల్లి మాటల్లా కమ్మగుంటది.
బడికి పోనని మారాం చేస్తుంటే సదుకోవాలే బిడ్డా అని సుద్దులు చెప్పే బాపు ప్రేమలాగుంటాది
ఆటలాడి అలసిపోయి ఇల్లు సేరంగానే సక్కినాలు సత్తుండలు సేతికిచ్చే సెల్లె ప్రేమలా భలేవుంటది.
దోస్తులతో వూరి సెరువులో ఈతలాడి సెరుకు తోటలో సెరుకు ముక్క తిన్నంత మస్తుగుంటది.
పెయ్యదూడ తాగే ఆవు పాలతో తీయని బెల్లం కలిపి అమ్మ చేసిన జున్ను తిన్నట్టుంటది.
వేసవి సెలవలకి తాత గారింటికెళ్ళి తాటి ముంజలు మామిడిపళ్ళ రసాలు తింటున్నంత తియ్యగా ఉంటది
ఏమని సెప్పుదు ఎంతని సెప్పుదు నా తెలుగు బాస కమ్మదనం
సన్నని నడుము మీద సత్తు బిందె పెట్టుకోని సరసాలాడుతూ తిరిగే మరదలు పిల్ల ఊసుల్లాగా హుషారుగుంటది
మూగబాసలు చేసుకుంటూ దగ్గర కావాలనుకునే ప్రేమికుల మనసులాగా మురిపెంగుంటది
లగ్గం పీటల మీద సిగ్గులు సిందిస్తూ కూర్చునే సిన్నదాని బుగ్గల ఎరుపులాగా మెరుస్తుంటది

మల్లెపందిరి కింద మంచమేసుకోని సందమామని చూస్తున్న ఆలూమగలతో దాగుడుమూతలాడే జాబిల్లి లెక్క చల్లగుంటది.
అత్తగారింట అడుగు పెట్టి అమ్మ సెప్పిన సుద్దులని ఆచరించే కొత్త కోడలి మరియాద సూసి మురిసిపోయే మామగారి మనసులాగుంటది

ఏమని వర్ణింతు నా తెలుగు భాష? ఎంతని ప్రేమింతు నా మాతృ భాష?
తొలేకాశి రోజు తొలి సినుకు పడంగానే దుక్కి దున్నిన నేలనుండొచ్చే  మట్టి వాసన లెక్క మంచిగుంటది.
బోనాల పండక్కి వరస కట్టిన ఫలారం బండ్ల చూసి సంబుర పడినట్లుంటది
శ్రావణపున్నమికి రాఖీ కట్టనీకి తెల్లరంగానే వచ్చిన సోదరి రక్త బంధం లాగా సిక్కగుంటది
గణేశుని మండపాల్లో పదకొండొద్దులు పంచిపెట్టే పెసాదాల లెక్క కడుపు నిండినట్లుంటది
బతుకమ్మ ఆటలకి తంగేడు , గునుగు పూలు పేర్చుకొచ్చి సుట్టూరా తిరుగుతూ పాడినట్లుంటది
దీపావళి పండక్కి మామగారు పెట్టే కట్నం లాగా కళకళమన్నట్టుంటది
సంకురాతిరికి సక్కినాలు పోసుకుంటూ సందడి సేసే సోపతి లాగుంటాది
శివరాత్రికి ఒక్కపొద్దులుండి జాగారం చేసి శివయ్యను సూసినంత సిత్రంగుంటది
ఉగాది పండక్కి అవ్వ సేసిన భక్షాలను నేతిలో ముంచి తిన్నంత రుచిగా ఉంటది
కవల పిల్లలని కన్న నా తెలుగు తల్లికి ఉఛ్వాస విశ్వాస రెండూ తెలుగు భాషే
భాషలో యాస పలికినా శ్వాసగా చేసుకోని పచ్చని పైరు గాలిని పీల్చి బతుకుతుంది నా తెలుగు తల్లి
ఈ గడ్డ మీద ప్రతి ఒక్కరినీ గెడ్డం పట్టుకొని నా బిడ్డ అని పిలిచే గొప్ప మనసు నా తెలుగు తల్లిది
ఆఖరి శ్వాస వరకు తెలుగు భాషను మరువనని తెలుగుతల్లిని విడువనని బాసలు చేసుకుందాం
మన తల్లికి బిడ్డలందరం కూడి పదాల మాలలు అల్లి పాదాభివందనం చేద్దామ్

జై తెలుగు తల్లి   -  జై తెలంగాణా భాష

- పొత్తూరి రాజ్యశ్రీ

# అమ్మ

పిలుపులో ఆనందం, మాధుర్యం 'అమ్మా' అని పిలువ గలగడమే అదృష్టం.. నవమాసాలు మోసి, కని, కళ్ళల్లో పెట్టుకుని పెంచుకొచ్చిన తల్లి ఋణాన్ని ఏ బిడ్డ తీర్చుకోలేదు.కంటికి రెప్పలా, అపురూపంగా చూసుకోవడమే అమ్మకు మనం ఇచ్చే కానుక.

అనురాగానికి అద్దం -- అమ్మ మమతకు మారు పేరు . ప్రేమకు ప్రతి రూపం అమ్మ సృష్టికి మూలం అమ్మ. అమ్మ లేకపోతే జననం లేదు. అమ్మ లేకపోతే గమనం లేదు. అమ్మ లేకపోతే సృష్టిలో జీవం లేదు. అమ్మ లేకపోతే అసలు సృష్టే లేదు. అమ్మ ప్రేమ ఎంతో విలువైనది. ఉన్నప్పుడు కనుక్కో లేనంత లేనప్పుడు కనుక్కోలేరు.

గర్భంలో గుడి కట్టి, రాత్రంతా అభిషేకించి, తన పేగు బంధాన్ని పూలమాలగా మార్చి, తొమ్మిది నెలలు కడుపులో పెట్టుకుని, పూజించే దేవత తల్లి. అమ్మ సృష్టికి ప్రతి సృష్టి నిచ్చి, సమాజానికి పరిచయం చేసి, నడకను, నడవడి-కను నేర్పి, మా భవితకు బంగారు బాటలు వేసిన ఓ మాతృ మూర్తి అమ్మ. నీకు పాదాభివందనం.

అమ్మ చేసే ప్రతి పని మన ఆనందం కోసమే. మన ఆనందాన్ని తన ఆనందంగా చూసుకునే గొప్ప వ్యక్తి అమ్మ. ఆకాశమంత మనసు ఉండి, సముద్రమంత కరుణ కలిగి, ప్రేమను మాత్రమే దోసిలితో చూస్తూ అక్కున జేర్చుకుం-టుంది. అమ్మ దగ్గర సేద తీరినట్లుగా మరెక్కడా కుదరదు. అమ్మ అనే పదం లోనే అంతులేని సౌందర్యం ఉంది. అందుకే ఆదిశంకరులు 'సౌందర్య లహరి' పేరుతో అమ్మ శక్తి యుక్తులను అక్షరబద్ధం చేశారు.

అమ్మ జగత్, అమ్మ ప్రకృతి, విశ్వ పాలన, పోషణ చూసే దివ్యమైన ప్రతినిధి .అమ్మ పర బ్రహ్మ స్వరూపం ఆమె ఋణం ఎన్నటికీ తీర్చుకోలేము అంటోంది వేదం. అమ్మను శక్తి స్వరూపిణిగా వర్ణించింది ఋగ్వేదం. అన్నం పెట్టి అన్నపూర్ణ తత్వాన్ని .....

సర్వ తీర్థ మయీ మాతా : సర్వ దేవ మయో పితా
మా తరం పితరం తస్మాత్ సర్వ యత్నేన పూజ్యేత్పుజ్యేత్ !!

అమ్మ సర్వ పుణ్య తీర్థాలకు ప్రతీక, నాన్న సర్వ దేవతల అవతార రూపం. కనుక జన్మ నిచ్చిన తల్లిదండ్రులను ప్రాణప్రదంగా పూజించుకోవాలనేది ఈ శ్లోక భావం. గుడిలేని దైవం అమ్మ.

"నాస్తి మాతృ సమా ఛాయా .. మాతృ సమాగతి
నాస్తి మాతృ సమం శరణం నాస్తి మాతృ సమో షాపా

అమ్మను మించిన నీడ ఎక్కడా లేదు అమ్మను మించిన రక్షణ మరెక్కడా దొరకదు. అమ్మకంటే ఆదరించేవారు జవజీవాలు నిచ్చేవారు ఈ లోకంలో ఇంకొకరు ఉండరని ఈ శ్లోకానికిఅర్థం.

అమ్మాయి అమ్మ అయినా ఆ క్షణం సరికొత్త అనుభూతి, నూతన అనుభవం, అత్యంత ఆనందం, విజయ గర్వం పొందుతుంది. ఆమె ధరించిన కొత్త రూపం, కొత్త తేజం కొత్త భావ జాలం, కొత్త వ్యక్తిత్వం, కొత్త ధైర్యం, కొంగ్రొత్త అవతారం. ఒకటి కాదు, ఎనిమిది అవతారాలను పోషిస్తుంది.

| | |
|---|---|
| ఉదయం --- ఇంటి పనులలో ----- | అష్టభుజి |
| పిల్లలను చదివిస్తూ ------------------ | సరస్వతి |
| ఇంటి ఖర్చులలో పొదుపు ---------- | మహా లక్ష్మి |
| కుటుంబం కోసం వంట జేయడంలో - | అన్నపూర్ణ |
| కుటుంబ విషయంలో ధృడంగా నిలబడడంలో --- | పార్వతి |
| తన మాట వినకపోతే -------------------- | దుర్గ |
| భర్త తెచ్చిన వస్తువు నచ్చకపోతే ---- | కాళీ |
| పుట్టింటి వారైనా ఏమైనా అంటే------ | మహిషాసురమర్దిని |
| భర్త వేరే స్త్రీని మెచ్చుకుంటే -------- | చండి |

పెండ్లి అయిన మగ వారు ఇంట్లో ఉంటే రోజూ నవ దుర్గలను దర్శించే అవకాశం ఉంటుంది.


తల్లిదండ్రులకు సేవ చేస్తే ఆరు సార్లు భూ ప్రదక్షిణ చేసిన ఫలం దక్కుతుంది . కాశీ యాత్ర చేసిన ఫలమూ, వంద-సార్లు సముద్ర స్నానం చేసిన ఫలం దక్కుతాయి .ఎవరు మారు దేవతను సుఖముగా ఉంచారో, సేవించారో, వారీర మాసాలు, శునక మాంసం కన్నా హీనం. తల్లి కంట కన్నీరు తెప్పించైనా, లక్ష గోవుల శాపమిచ్చినా, వెయ్యి అశ్వ మీద యాగాలు చేసినా ఆ పాపం పోదు. తల్లిని మించిన దైవం లేదు. గాయత్రిని మించిన మంత్రం లేదు. అమ్మా .. నీకు వందనం. అభివందనం.

మాతృదినోత్సవ శుభా కాంక్షలతో


ఐ పి ఎల్ లో బౌలర్లకు చుక్కలు చూపిస్తున్న 15 సంవత్సరాల బాలుడు
వైభవ్ సూర్యవంశి
NEOM
LUMINOUS


ఘన విజయం సాధించిన
టి వి కె పార్టీ నేత విజయ్

RNI No. TELTEL/2011/39497 MAY 2026 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st May Date of Posting:8th May




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.